Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)


స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు స్థాపితం: 1930 జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

Longest Living Newspaper in Telugu Journalism

సమాజం

సంపుటి: 81 • సంచిక: 43 • 22-10-2010 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-





అందరూ దొంగలే; ప్రజలే వెర్రి వెంగళప్పలు!

● ఎమ్మార్ దోపిడీపై రోశయ్య దాగుడు మూతలాట చూసే వారికి వికారం కల్గిస్తున్నది.

ఎపీఐఐసీ ఆస్తులను అక్రమంగా కొల్లగొట్టిన ఎమ్మార్ ఎంజిఎఫ్ కంపెనీ విషయంలో ముఖ్యమంత్రి రోశయ్య ఆడుతున్న నాటకం రాష్ట్రంలో నడుస్తున్న దోపిడీ రాజ్యానికి అద్దం పడుతున్నది. దొంగలు దొంగలు వూళ్లు పంచుకొన్న సామెతను జ్ఞప్తికి తెస్తున్నది.


ఎమ్మార్ సంస్థ – మన రాష్ట్రంలో గత ఆరేళ్లుగా జరుగుతున్న లక్షల కోట్ల రూపాయల అవినీతి కుంభకోణాలకు ఒక మచ్చు తునక. చంద్రబాబు హయాంలో రాష్ట్రంలోకి ప్రవేశించింది ఇది. హైదరాబాద్ నగరానికి అంతర్జాతీయ స్థాయి వృత్తినిపుణులు, సాఫ్ట్‌వేర్ కంపెనీలు తరలి రావాలంటే వారి జీవనశైలికి తగిన వసతులు కల్పించాలన్న ప్రణాళికతో ఈ సంస్థను రప్పించారు. దుబాయికు చెందిన ఈ కంపెనీ అంతర్జాతీయ ప్రమాణాలతో నివాస, వాణిజ్య, పారిశ్రామిక సముదాయాలను నిర్మించడంలో పేరెన్నికగన్నది. దుబాయిలో నిర్మితమైన ప్రపంచంలోకెల్లా పొడవైన అల్ బుర్జ్ భవంతి కట్టింది కూడా వీరే. వీరి ద్వారా చంద్రబాబు నాయుడు హైటెక్ సిటీలో అంతర్జాతీయ స్థాయి కన్వెన్షన్ మందిరం, గోల్ఫ్ కోర్సు వంటివి నిర్మింప చేశాడు. వాటికి అనుబంధంగా వున్నతశ్రేణి వృత్తి నిపుణుల నివాసాలకు గృహ సముదాయాలు నిర్మించాలి. ఈ దశలో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి అధికారంలోకి వచ్చాడు. రాముడి కాలు తగలగానే రాయి అహల్యగా మారినట్లు, వైఎస్ చేయి పడిన ప్రతి ప్రజా ప్రయోజన పథకమూ ఒక అవినీతి కుంభకోణంగా మారడం సహజంగా జరిగే పరిణామం. ఇదీ అంతే. చంద్రబాబు చేసిపోయిన ఒప్పందం ప్రకారం ఎమ్మార్ నిర్మించే గృహ సముదాయాలలో 26శాతం వాటా ఎపీఐఐసీకి చెందాలి. అప్పట్లో అక్కడ భూముల విలువ చాలా తక్కువ. ఎకరా 10 లక్షలకు లోపే పలుకుతుండేది. కానీ ఆ తర్వాత అది ఎకరా 10కోట్లకు పెరిగిపోయింది. దానితో ఎమ్మార్ కంపెనీ యజమానులకు దుర్బుద్ధి పుట్టింది. అందుకు వైఎస్ సహకరించాడు. దానితో ఎమ్మార్ కంపెనీ ఎపీఐఐసీని పక్కనపెట్టి, ఎంజిఎఫ్ అనే మరొక కంపెనీతో చేతులు కలిపి, మొత్తం భూమి దానికి బదలీ చేసింది. ఈ మార్పు వల్ల ఎపీఐఐసీకి వాటా లేకుండా పోయింది. ఇప్పటి విలువ ప్రకారం ఎమ్మార్ ఎంజిఎఫ్ అమ్మే ఇళ్ల ద్వారా ఎపీఐఐసీకి దాదాపు 10వేల కోట్ల రూపాయల లాభం రావాలి.

కాంగ్రెస్ నేత డిఎల్.రవీంద్రరెడ్డి ఈ కుంభకోణాన్ని వెలికి తీశాడు. దానితో దేశవ్యాప్తంగా రచ్చ రేగింది. చిదంబరం, ప్రణబ్ ముఖర్జీ వంటి కేంద్ర నేతలు కూడా ఈ దోపిడీని చూసి ఆశ్చర్యంతో నోరు వెళ్లబెట్టారు. ముఖ్యమంత్రి రోశయ్య వీరావేశం ప్రదర్శించారు. ప్రజాధనం ఇట్లా దోచుక తినే వారిని వూరకే వదలబోమని భీకర హూంకారాలు చేశాడు. దీనిపై సిబిఐ విచారణ జరిపిస్తామని, ఎమ్మార్ కంపెనీ నుంచి ఎపీఐఐసీకి రావాల్సిన వేల కోట్ల రూపాయల సొమ్ము కక్కిస్తామని, దోషుల భరతం పడతామని గంభీర ప్రకటనలు చేశారు. దీనిపై ఒక నిపుణుల కమిటీ వేస్తే, వారు ఎమ్మార్ చేసింది నమ్మక ద్రోహమని తేల్చారు. భారత సొలిసిటర్ జనరల్ గోపాల సుబ్రహ్మణ్యం, ఈ ఒప్పందాన్ని రద్దు చేసి ఎమ్మార్ కిచ్చిన భూమి స్వాధీనం చేసుకోవాలని న్యాయ సలహా ఇచ్చారు. అవి విన్న జనం నిజమే అనుకొన్నారు.

కానీ నెల తిరిగే సరికి అంతా మారిపోయింది. ఎమ్మార్ నుంచి

కొరవ 14వ పేజీలో

కార్టూన్ స్కేప్



ముందస్తుగా ఎనభై కోట్ల పన్ను కట్టారటగా... వెనకస్తు లాభాలు ఎంత కూడబెట్టారని... అడుగుతున్నారు సార్...!

జైపాల్‌రెడ్డి ముస్తాబు

తాత పోతే బొంత నాదన్నట్లు రోశయ్యను ఏ కారణం వల్ల తప్పించినా ముఖ్యమంత్రి పీఠం నాది అనే వూహల్లో తేలియాడుతున్నాడు కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి. రోశయ్య మీద అధిష్టానానికి అన్నిరకాల నమ్మకాలు నశించాయన్న ప్రచారం ఢిల్లీలో జోరుగా జరుగుతుండడమే ఇందుకు కారణం. ఇటు పార్టీ పరంగా కానీ, అటు పరిపాలనా పరంగా కానీ రోశయ్యను ఎంతో కాలం కొనసాగించడం క్షేమం కాదన్న అభిప్రాయం ఢిల్లీలో ఏ గోడకు చెవి ఆనించినా విన్పడుతున్నది. గతవారంలో ఆయన ఢిల్లీకి వచ్చి సోనియాగాంధీని కలిసి వెళ్లిన తర్వాత అది మరింత విస్తృతమైంది. అయితే మార్పు ఇప్పుడే వుంటుందా, లేక డిసెంబర్ నెలలో శ్రీకృష్ణ కమిటీ నివేదిక తర్వాత వుంటుందా అన్నది ఎవరూ చెప్పలేక పోతున్నారు. కమిటీ నివేదిక వచ్చిన తర్వాత రాష్ట్రంలో తలెత్తే విపరిణామాలను ఎదుర్కొనే సమర్థత రోశయ్యకు లేదని తేలిపోయింది కాబట్టి, ఈ లోగానే ఒక సమర్థ నాయకుడిని ఆ స్థానంలో కూర్చోబెట్టడం మంచిదన్నది ఒక వాదన. కమిటీ నివేదిక తర్వాత రాష్ట్రపతి పాలన పెట్టి, అన్ని రకాల ఆందోళనలు అణిచివేసి, ఆ తర్వాత కొత్త ముఖ్యమంత్రి ఆలోచన చేయడం మంచిదని మరొక వాదన.

ఇందులో ఏది జరిగినా తనకు అవకాశం వస్తుందని జైపాల్‌రెడ్డి బలంగా నమ్ముతున్నాడు. పైకి మాత్రం తనకు ముఖ్యమంత్రి పదవి మీద ఆశలేదని, తనకు జాతీయస్థాయిలో వున్న ప్రతిష్టను భంగపరచుకొని ఆ వూబిలో దిగడం కంటే, ఢిల్లీలోనే వుండిపోవడం మేలని తనను కలిసిన

కొరవ 14వ పేజీలో



ధన దౌర్భాగ్యం

కర్ణాటక రాష్ట్రంలో గత రెండు వారాలుగా నడుస్తున్న రాజకీయ నాటకానికి మూలకారణం ధన మదం. ఆ రాష్ట్రం లోని ఇనుప ఖనిజం గనులు ప్రధానంగా మూడు కుటుం బాల గుప్పెట్లో చిక్కుకొని వున్నాయి. ఒక్కొక్కరు ఒక్కొక్క పార్టీకి కొమ్ము కాస్తున్నారు. జగమెరిగిన గాలి సోదరులు బిజెపి మద్ద తుదారులు. ఆయనకంటే ఎంతో ముందు నుంచి, మూడు తరాలుగా ఇనుప ఖనిజం గనుల వ్యాపారంలో వున్న అనిల్ లాడ్ సోదరులు కాంగ్రెస్‌ను ఆశ్రయించి వున్నారు. బల్‌దో టాస్‌గా పిలవబడే మూడవ కుటుంబం హెచ్‌డి.దేవగౌడ జనతాదళ్ పార్టీకి అనుబంధితులు. ఈ కుటుంబాలు మూడూ నడమంత్రపు సిరితో విర్రవీగుతున్నాయి. ఎవరికివారు రాష్ట్ర రాజకీయ పెత్తనం తమకే దక్కాలన్న తమకంతో పెట్రేగి పోతు న్నారు. తమ దగ్గరున్న డబ్బును విచ్చలవిడిగా వెదజల్లుతు న్నారు. దాని ఫలితమే ఆ రాష్ట్రంలో నిత్య రాజకీయ అస్థి రత్వం. వీరు ముగ్గురూ పోటీలు పడి మరీ ఎమ్మెల్యేలకు వల విసురుతున్నారు. సంతలో పశువులను కొన్నట్లు ఎమ్మెల్యేలను కొనడానికి వేలం పాట పాడుతున్నారు.

మొదటగా బల్‌దోటాస్ కుటుంబం రంగంలోకి దిగింది. ముఖ్యమంత్రి యడ్యూ రప్పను గద్దె దించడానికి 16 మంది ఎమ్మె ల్యేలను బేరమాడి కొనుగోలు చేసింది. ఆ వెంటనే కాంగ్రెస్ పక్షంగా లాడ్ సోదరులు ముగ్గులోకి ప్రవే శించారు. ఇద్దరూ కలిసి ఒక్కొక్క ఎమ్మెల్యేకు 30 నుంచి 40 కోట్ల రూపాయల ధర చెల్లించి, యడ్యూరప్ప మీద తిరుగు బాటు చేయించారు. కర్ణాటక అసెంబ్లీలో మొత్తం సభ్యుల సంఖ్య 223. అందులో బిజెపి బలం 116 మాత్రమే. అంటే మెజార్టీకి నలుగురు సభ్యులు మాత్రమే అధికంగా వున్నారన్న మాట. ఇందులో 16 మంది మద్దతు ఉపసంహరిస్తే ప్రభుత్వం పడిపోవడం ఖాయం. ఆయన్ను పడగొట్టి, కాంగ్రెస్ ఆసరాతో గద్దె ఎక్కాలని దేవగౌడ కుమారుడు కుమారస్వామి కలలు కన్నాడు. ఆయనకున్న ఎమ్మెల్యేల బలం 28 మాత్రమే. కాం గ్రెస్‌కు 73 మంది వున్నారు. ఈ బలానికి తిరుగుబాటు ఎమ్మె ల్యేలు 16 మంది కలిస్తే వారి కల నెరవేరడం కష్టం కాదు.

కానీ బిజెపి అగ్రనేత ఎం.వెంకయ్యనాయుడు తన గజకర్ణ గోకర్ణ విద్యా పాండిత్యమంతా ప్రదర్శించి, స్పీకర్‌ను కీలుబొమ్మగా మార్చి, విశ్వాస పరీక్ష చివరి నిముషంలో స్పీకర్ ద్వారా తిరుగుబాటు ఎమ్మెల్యేలు పదవికి అనర్హులన్న ప్రకటన చేయించి, ప్రభుత్వాన్ని నిలబెట్టాడు. ఈ రెండు పరిణామాలూ ప్రజాస్వామ్య వృక్షానికి గొడ్డలి వేటు వంటివే. పార్టీ ఫిరాయిం పుల ద్వారా ప్రజలెన్నుకొన్న ప్రభుత్వాలను కూలద్రోయాలను కోవడం సహించరాని నేరం. రాజ్యాంగ విరుద్ధంగా, శాసన సభ సాంప్రదాయాలను మంట గలిపి, స్పీకర్ పదవిని దుర్వినియోగం చేసి, అక్రమ పద్ధతులలో ప్రభుత్వాన్ని నిలబెట్టడం గర్హనీయమైన విషయం.

ఈ వివాదం ఇప్పుడు కర్ణాటక హైకోర్టు పరిశీలనలో వుంది. స్పీకర్ నిర్ణయం రాజ్యాంగ సమ్మతమా కాదా అన్న ప్రశ్నకు న్యాయమూర్తుల మధ్యనే ఏకాభిప్రాయం కుదరడం లేదు. ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనం ఈ అయోమయం తోనే మూడవ న్యాయమూర్తి సహకారం కోరింది. కోర్టు తీర్పును బట్టి, యడ్యూరప్ప ప్రభుత్వం నిలుస్తుందా కూలు తుందా అన్నది తేలాలి ఇప్పుడు.

ఈ కథకు ఇక్కడ కూడా ముగింపు లభించే సూచనలు లేవు. ఒకవేళ హైకోర్టు ఎమ్మెల్యేల అనర్హత నిర్ణయం చెల్లదని తీర్పు చెప్తే, మరొకసారి యడ్యూరప్ప ప్రభుత్వం మైనార్టీలో పడి పోతుంది. అందువల్ల ఇప్పటి నుంచే కాంగ్రెస్ ఎమ్మెల్యేల కొను గోలుకు వేలం పాట నడుపుతున్నారు గాలి సోదరులు. వారి ధర ఒక్కొక్క ఎమ్మెల్యేకి 50 కోట్ల రూపాయలట. ఇప్పటికే ఒక కాంగ్రెస్ ఎమ్మెల్యే అనే నరపశువు ఆ రేటుకు అమ్ముడుపోయింది కూడా. ఈ రాజకీయ నాటకాలు చూస్తుంటే జుగుప్స కల్గుతు న్నది. జాతి మేలుకు ఉపయోగపడాల్సిన ఖనిజ వనరుల వంటి ప్రకృతి సంపద అక్రమార్కుల గుత్త సొత్తుగా మారితే సమాజా నికి జరిగే చేటు ఎంత భయానకంగా వుంటుందో విడ మరచి చెప్తున్నాయి ఈ పరిణామాలు. ధన దౌర్భాగ్యం కర్ణాటక ప్రజల పాలిట ఒక శాపంగా మారుతున్నది. రాజకీయ పార్టీలు ఇట్లా ధన దౌర్భాగ్యుల చేతులలో కీలుబొమ్మలుగా మారితే, ప్రజాస్వా మ్యానికి దుర్గతి తప్పదు. గనుల వంటి జాతీయ సంపద సమ స్తాన్ని జాతీయం చేయడమొక్కటే ఈ దుర్మార్గాలకు పరిష్కారం.

జమీన్‌రైతు

జనవాణి

జనరిక్ మందులషాపు ఓ వరం!

ప్రజలకు ఉచిత వైద్యం అందజేసేందుకు ప్రభుత్వం కోట్లాది రూపా యలు ఖర్చు చేస్తున్నా వ్యవస్థలో జవాబుదారీతనం, చిత్తశుద్ధి లోపించడంతో ఆశించిన ప్రయోజనం చేకూరడం లేదు. చుక్కలనంటుతున్న మందుల ధరలు సామాన్యుడ్ని ఆర్థికంగా కలవరపెడుతున్నాయి. ఈ దశలో సామాన్యుడికి మం దులను చౌకగా అందుబాటులోకి తెచ్చే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం జనరిక్ మందుల షాపు ఏర్పాటును ప్రతిపాదించింది. దీనికి అనుగుణంగా నెల్లూరు పట్టణంలో ఈ షాపుల ఏర్పాటుకు కలెక్టర్ రాంగోపాల్ గారు ప్రత్యేక శ్రద్ధ తీసు కొని రెడ్‌క్రాస్ సొసైటీ సౌజన్యంతో షాపు తెరవడం జరిగింది. ఈ షాపులో చౌకరేట్లకు మందులు దొరుకుతున్నాయి. నగరంలోని వైద్యులు కూడా సొంత లాభం కొంత మానుకొని జనరిక్ మందులను వ్రాసిస్తే ప్రజలకు మేలుచేసిన వారవుతారు.

సి.హెచ్.హనుమంతరావు నెల్లూరు

విగ్రహాల డబ్బు విద్యకిస్తే మంచిది!

రాష్ట్రంలో వేల కొలది వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాల ఏర్పాటుకు రంగం సిద్ధమయ్యింది. విగ్రహాలు కాంశ్యమైతే ఓ హోదా. అయితే వీటి ఖరీదు జాస్తి. ఓ విగ్రహం నాలుగు లక్షలవుతుంది. అదే ఫైబర్, సిమెంటుతో ఏర్పాటుచేస్తే యాభైవేల నుంచి లక్ష రూపాయల వరకు ఖర్చవుతుంది. విగ్రహం ఖరీదు కాకుండా దాని పీఠం నిర్మాణ ఖర్చులు, శిలాఫలకం, మీటింగు ఖర్చులు తడిసి మోపెడవుతాయి. మొత్తం మీద రాష్ట్రంలో కేవలం వైఎస్ విగ్రహాల ఏర్పాటుకే 15 కోట్లు ఖర్చు పెట్టనున్నారు. మీటింగుల ఖర్చుతో లెక్కేస్తే 250 కోట్లు దాటే స్తుంది. ఈ మొత్తంతో ఒక నిధి ఏర్పాటుచేసి విద్యార్థులకు స్కాలర్‌షిప్పుగానీ బీదలకు వైద్య సౌకర్యాలు, అనాధ శరణాలయాలకు సహాయం చేస్తే వైఎస్ పేరు చిరస్థాయిగా నిలిచి పోతుంది. ఐదారు సంవత్సరాల తర్వాత ఈ విగ్ర హాల గూర్చి పట్టించుకునే వారుండరు.

టి.కె.రెడ్డి నెల్లూరు

శంకరన్ విగ్రహాన్ని నెలకొల్పుదాం!

మంచికి మారుపేరు, నీతినిజాయితీకి నిలువుటద్దం, గాంధేయవాది ఐఎఎస్‌కే పన్నె తెచ్చిన ఎస్ఆర్ శంకరన్ గారి విగ్రహాన్ని నెల్లూరులో నెల కొల్పడం సముచితం. ఆయన నెల్లూరు కలెక్టర్‌గా చేసిన సేవలు జిల్లావాసుల హృదయాల్లో పదిలంగా వున్నాయి. కలెక్టరంటే ప్రథమంగా అందరికీ గుర్తొచ్చే

కొరవ 14వ పేజీలో

70 ఏళ్ల క్రితం ఈవారం

25-10-1940
పేజీలు : 16 వెల: అణా

నెల్లూరు ముచ్చట్లు

మళ్లీ పెళ్లి

మళ్లీ పెళ్లి అంటే వై.వి.రావుగారి సినిమా అనుకుంటారేమో?

మన వకీలు పి.సుబ్బరాయన్ బావ మరిదిన్నీ, మద్రాసు కొండిచెట్టి 13 నివాసి న్యాయవాదిన్నీ, అగ్నిసాక్షిగా పెండ్లాడిన భార్యా బిడ్డలు గలిగిన వెంకట రామశాస్త్రిగారు గత 6తేదీన బెజవాడలో డాక్టర్ కొమర్రాజు అచ్చమాంబ ఎఫ్.ఆర్.సి అండ్ ఎస్ (ఎడింబరో) ఎల్.ఎం (డబ్లిన్) గారిని మిత్రుల సాక్షిగా (అగ్నిసాక్షిగా గాదు) వివాహ మాడినాడట.

సంఘం పేరిట జరిగే యిలాంటి అక్రమాలను అరికట్టడానికి గాని చివరకు గర్హించడానికి గాని విమర్శించడానికి గాని బారు అసోసియేషన్‌లకు జూరిస్ డిక్షన్ లేదా ఏమిటి?

మోసపు గ్యాంగి

కరెన్సీ నోట్లు చేస్తామనే మోసపు గ్యాంగి ఒకటి నెల్లూరులో విడిది చేసి యున్నదట రెండు నెలలుగా. మోసపోతారేమో జాగ్రత్త!! ఇంకా ఈ వార్త పోలీసు చెవుల వరకూ రానే లేదా?

ఇక్బాల్ మహాకవి స్వాతంత్ర్య పిపాసి

'సబ్ సే అచ్ఛా హై వతన్ హిందూస్థాన్ హమారా అనే సుప్రసిద్ధ జాతీయ గీతం యొక్క రచయిత ఈయనే. ఇస్లాం మతము నందు భక్తి శ్రద్ధలు గలవాడు. గొప్ప దేశభక్తుడు, సామ్రాజ్యవాద వ్యతిరేకి. ఈయన గారి అభిప్రాయాలు చాలా గాఢమైనవి. వీరి పద్యములు, పాటలు గొప్ప గొప్ప ఆదర్శములను చాటుతున్నది.

50 ఏళ్ల క్రితం ఈవారం

21-10-1960
పేజీలు: 12 వెల: 0-20 న.పై

ఏ.సి ఢిల్లీ యాత్ర ఉద్దేశ్యం?

ఏ.సి సుబ్బారెడ్డి గారు ఢిల్లీకి ఎందుకు పోయినట్లు? యూనిటీ ఫ్రంటు నాయకులకు గూడా తెలియని ఈ ఢిల్లీ ప్రయాణ వుద్దేశ్యమేమిటి? పళ్లంరాజుగారు ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షతకు సమ్మతించే అవకాశం లేదని; అలాంటప్పుడు కాంగ్రెస్ అధ్యక్షుడు ఒక పేరు సూచించవలసి వుంటుందని ఆ అవకాశాన్ని తనకివ్వవల సిందిగా కోరుటకే, సంజీవరెడ్డి గారికి సన్నిహితుడైన ఏ.బలరామరెడ్డి గారిని తీసుకొని సుబ్బారెడ్డిగారు ఢిల్లీకి పోయారని ఒక వార్త.

ఇందులో నిజం ఎంతవరకు వున్నదో మనకు తెలియదు. ఇదిట్లుండగా, యూనిటీ ఫ్రంటుకు చెందిన ఒక శాసనసభ్యుడు చెప్పడంలో ఇరువురి మధ్య రాజీ అసంభవమని; ఒకవేళ పళ్లంరాజుగారు అధ్యక్షుడైనా, ఒకే ముఠాకు చెందిన వారితో పార్టీ కార్యవర్గాన్ని నిర్మించిన ముఖ్యమంత్రి చర్యను అభిశంసించడం జరుగు తుందని, దాని ప్రయత్నం అప్పుడే ప్రారంభమైనదని అన్నాడు.

అంటే ఆంధ్ర కాంగ్రెస్‌వాదులలో సమైక్యత కనుచూపు మేరలో లేదన్నమాట.

నాగార్జునసాగర్ నీరు

1962 నుండే కృష్ణడెల్టా క్రింద వున్న రెండు లక్షల ఎకరాలకు నాగార్జున సాగరం నీరు సరఫరా చేయుటకు ప్రాజెక్టు పాలక సంఘం నిర్ణయించింది.

ద్వితీయ ప్రణాళిక చివరి సంవత్సరమైనా ఈ ఏటికి ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం మొదట 9కోట్లు, ఆ తర్వాత మరొక కోటి రూపాయలు కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం ఇంకో కోటి ఇవ్వడంతో ప్రాజెక్టు పని శరవేగమయ్యింది.

నెల్లూరు ముచ్చట్లు

విశ్వకవిడు

నెల్లూరులో ఐమాక్స్ థియేటర్లు

నెల్లూరులో వచ్చే ఏడాదికి ముచ్చటగా మూడు ఐమాక్స్ థియేటర్లు ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. ప్రస్తుతం దర్గామిట్టలో వున్న ఎన్నార్ సినీ విలాస్ ప్రాంగణంలో ఈ మూడు ఐమాక్స్ థియేటర్ల నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. షాపింగ్ కాంప్లెక్స్‌లు, అధునాతన ఫుడ్ కోర్టులు సర్వహంగులతో ఇవి కొలువు తీరనున్నాయి. నెల్లూరీయులకు ఎప్పటి నుంచో ఎన్నార్‌గా సుపరిచితుడైన పారిశ్రామికవేత్త నెల్లూరు రాధాకృష్ణారెడ్డి నెల్లూరుస్థాయి మరింత పెంచేలా ఈ ఐమాక్స్ థియేటర్ల నిర్మాణం చేస్తారనే దాంట్లో ఎటువంటి సందేహం అక్కర లేదనుకొంటాం.

వర్షం

19వ తేదీ మధ్యాహ్నం, రాత్రి ఓ గంటపాటు కురిసిన వర్షానికి నెల్లూరు నగరంలో జనజీవనం స్తంభించింది. జోరున కురిసిన వర్షానికి వన్‌టౌన్‌లో డ్రైనేజి పొంగి పొర్లడంతో జనం వర్షం ఆగిన రెండు గంటలకు కూడా మోకాలు లోతు నీళ్లలో నడవాల్సి వచ్చింది. ఉరుములు మెరుపులు తీవ్రస్థాయిలో రావడంతో నగరంలో పది ట్రాన్‌ఫార్మర్లు దెబ్బతిని విద్యుత్ సరఫరా ఆగింది. ఈ సమయంలోనే హైఓల్టేజి రావడంతో పలు ప్రాంతాల్లో ఇళ్లలోని టీవీలు, ఫ్రిజ్‌లు కాలిపోయాయి.

సాక్షి ఛానల్‌లో బ్రదర్స్‌కు శాపనార్థాలు

ఇటీవల వరకు సాక్షి పత్రిక, టీవీల్లో ఆనం సోదరుల అనుకూల వార్తలొచ్చేవి. జిల్లాలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఓదార్పు యాత్రకు సోదరులు ఏదో విధంగా అడ్డం తగులుతుండడంతో సాక్షి ఛానల్‌లో 18వ తేదీ రాత్రి 10.30 గంటల ప్రాంతంలో వారి వైఖరిని తప్పు పడుతూ 'ద్రోహ సోదరులు' కార్యక్రమం ప్రసారం చేశారు. ఉదయగిరిలో జగన్ ఓదార్పు యాత్రలో పాల్గొన్న ద్వితీయ శ్రేణి నాయకుల చేత 15 నిమిషాల పాటు ఆనం సోదరులను తిట్టించారు.

20వ తేదీ ఉదయం నుంచి నెల్లూరు చేపల మార్కెట్ వద్ద వైఎస్ విగ్రహ ఏర్పాటును అడ్డుకొన్నదెవరంటూ ఇక్కడ ఏర్పాటుచేసిన ప్రత్యేక శిబిరంలోని మహిళలను, కార్యకర్తలను గుచ్చి గుచ్చి ఆ ఛానల్ విలేకరి ప్రశ్నిస్తూ ఆనం వివేకానందరెడ్డిని జనం చేత శాపనార్థాలు పెట్టించాడు. ఈ వ్యవహారంపై వివేకా స్పందన ఏవిధంగా వుంటుందో చూడాలి.

మమ్మల్ని కాదు - వాళ్లనూ తిట్టండి!

ఓదార్పు యాత్రలో తమ కుటుంబం పాల్గొనడం లేదని తిట్టడం సబబు కాదంటున్నాడు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి. 18వ తేదీ విలేకరులతో మాట్లాడుతూ ఓదార్పులో నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్ రెడ్డి పాల్గొనడం లేదు. కానీ వాళ్లను తిట్టడం లేదు. ఓదార్పుకు ఇష్టం వున్న వాళ్లు వెళ్తారు. లేని వాళ్లు వెళ్లరు. చేపల మార్కెట్ వద్ద వైఎస్ విగ్రహ ఆవిష్కరణను మేమెందుకు అడ్డుకొంటాం? ఏదిఏమైనా గాంధీబొమ్మ దగ్గర వైఎస్ విగ్రహం పెట్టడం సబబు కాదని తేల్చి చెప్పారు వివేకా.

ఉదయగిరికి ఏంచేసినా వైఎస్‌నే చేశాడు!

రాష్ట్రానికి ముఖ్యమంత్రులుగా పలువురు పనిచేసినా ఉదయగిరి నియోజకవర్గానికి అంతో ఇంతో మేలు చేసింది దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డేనని ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి స్పష్టం చేశారు. వైఎస్ జగన్ ఓదార్పు యాత్రను పురస్కరించుకొని అక్కడి ట్యాంక్ బండ్‌పై రాజశేఖర్‌రెడ్డి విగ్రహావిష్కరణ అనంతరం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి సిఎంగా మూడు సార్లు ఉదయగిరి వచ్చాడు. 120 కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మింప తలపెట్టిన సీతారామ్‌నగర్ ప్రాజెక్టుకు భూమి పూజ చేశాడు. ప్రపంచవ్యాప్తంగా పేరు గడించిన రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ఉదయగిరి నుంచే ప్రారంభించిన విషయం గుర్తు చేశారు.

తెగ తాగేస్తున్న నెల్లూరీయులు!

నెల్లూరీయుల రూటే సపరేటు. హంగు ఆర్భాటం, విందు విలాసాల్లో ముందుంటారు. ఎక్సైజ్ శాఖ బ్రాందీ షాపులకు పాట పెట్టి షాపులు కేటాయించిన ఈ మూడు నెలల్లోనే నెల్లూరు నగరవాసులు 35.89 కోట్ల రుపాయల మద్యం తాగేశారు. అంటే నెలకు 12 కోట్ల రూపాయలు మద్యానికి తగలేశారన్న మాట. రూరల్ నియోజకవర్గం ప్రజలు తక్కువ తాగలేదు. 16.43 కోట్ల రూపాయల మద్యం, బీరు బాటిళ్లు ఖాళీ చేసి ద్వితీయస్థానంలో నిల్చారు. గూడూరీయులు 14.39 కోట్ల రూపాయల మద్యం తాగి తృతీయస్థానంలో నిల్చారు. జులై, ఆగష్టు, సెప్టెంబర్ మాసాల్లో ఎన్నికలు ఇతర స్పెషల్ మీటింగులు లేకుండానే జిల్లావ్యాప్తంగా 170.67 కోట్ల రూపాయల మద్యం అమ్ముడయ్యి అందరినీ కళ్లు తిరిగేట్లు చేసింది.

చిన జియ్యర్ స్వామి

చిన జియ్యర్ స్వామి 24వ తేది నెల్లూరు వస్తున్నారు. మినీ బైపాసు రోడ్డులో ఏర్పాటు చేసిన అన్నమయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. ఈ సందర్భంగా ఈ ప్రాంతంలోనే జరిగే వెంకటేశ్వరస్వామి పుష్పయాగంలో కూడా స్వామి పాల్గొంటారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూధర్మ పరిషత్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాయి. దాత, ప్రముఖ కాంట్రాక్టర్ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈ కార్యక్రమానికి ఆర్థిక చేయూతనందిస్తున్నారు.

నెల్లూరు చిత్రకారునికి గ్లోబల్ అవార్డు!

నెల్లూరు వెంకటేశ్వరపురం వాసి మినియేచర్ ఆర్ట్ కళాకారుడు అమీర్ గీసిన చిత్రానికి జాతీయస్థాయిలో గ్లోబల్ అవార్డు లభించింది. ఒక వృక్షం చిత్రంలోనే జాతీయంగా అంతర్జాతీయంగా పేరుగాంచిన పలు సంఘటనలకు సంబంధించిన 512 చిత్రాలు చిత్రీకరించినందుకుగాను ఈ అవార్డు అతని సొంతమయ్యింది. అమీర్ మంచి చిత్రకారుడైనా ఎందువల్లో అతని కళ ఇన్నాళ్లు మరుగున పడి వుండింది. గ్లోబల్ అవార్డు ద్వారానైనా అతను వెలుగులోనికి వస్తాడనుకొంటున్నాము.

జూబ్లీ ఆసుపత్రి పనుల్లో అవినీతి!

నెల్లూరు నగరంలోని జూబ్లీ ఆసుపత్రిలో అభివృద్ధి పనుల పేరిట ఇష్టానుసారంగా అంచనాలు తయారుచేసి ఆరు లక్షల రూపాయలు స్వాహాచేసిన ఇంజనీరింగ్ అధికారులు జడ్పీ ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని లోతు దర్యాప్తు చేయడంతో సస్పెండ్ అయ్యారు. ఎనిమిది లక్షల రూపాయలు వ్యయమయ్యే పనికి 14 లక్షలతో అంచనాలను ఇంజనీరింగ్ అధికారులు రూపొందించి స్వాహా చేశారు. ఇంజనీర్ అయిన జడ్పీ ఛైర్మన్ తన పరిశీలనలో ఈ విషయాన్ని పసిగట్టడంతో దీనికి కారకులైన డిఇ, ఎఇలను సస్పెండ్ చేయగలిగారు. మిగతా చోట్ల జరిగే అభివృద్ధి పనుల్లో ఏ మేరకు అవినీతి జరుగుతుందనేది ఈ సంఘటన లోకానికి చాటి చెప్పింది.



గ్రామ పంచాయితీలలో చెత్తను ఎత్తేందుకు జిల్లా పరిషత్ నిధులతో కొన్న ట్రక్కులను గ్రామ కార్యదర్శులకు అందిస్తున్న జడ్పీ ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి. ప్రక్కన జడ్పీ వైస్ ఛైర్మన్ రాజా, కలెక్టర్ రాంగోపాల్, ఎస్పీ దామోదర్, జడ్పీ సిఇఓ రామిరెడ్డి,

ఇళ్ల వద్ద నిరసనలు వద్దు

తెలుగుదేశం పార్టీ అనుబంధ విద్యార్థి సంఘం టిఎన్ఎస్ఎఫ్ ఇటీవల ఉత్సాహంగా పలు కార్యక్రమాలు చేపడుతుంది. దీనిలో భాగంగా పార్టీ జిల్లా నాయకత్వానికి మాట మాత్రం చెప్పకుండా కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి ఇంటి వద్ద ఆయన దిష్టిబొమ్మను దహనం చేయడంతోపాటు కాస్త గందరగోళం చేశారు. విషయం తెలిశాక పార్టీ జిల్లా అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వీరిని పిలిపించి నేతల ఇళ్ల వద్ద ఇటువంటి కార్యక్రమాలు వలదని సుతిమెత్తగా చెప్పినట్లు తెలిసింది. గతంలో టిఎన్ఎస్ఎఫ్ నేత బీద రవిచంద్రకు ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వాలని తెలుగుదేశం పార్టీ ఆఫీసులో హైడ్రామా చేసి ఆయన చేత తన్నులు తినాల్సి వచ్చింది.

సోమిరెడ్డి జమున స్మారక పురస్కారం

సోమిరెడ్డి జమున స్మారక సాహితీ అవార్డు బహూకరణ కోసం నిర్వహించిన 'నానీల సంపుటి'ల పోటీలో పసనకర్ల ప్రకాశ్ రచించిన గోదావరి కెరటాలు నానీల సంపుటి బహుమతిని గెల్చుకొంది. నవంబర్ 7వ తేది నెల్లూరు ఐఎంఏ హాలులో ఏర్పాటుచేసే సభలో ఈ పురస్కారం అందిస్తామని నెల్లూరు జిల్లారచయితల సంఘం కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ చెప్పారు.

జగన్‌ను కలసిన దేగా

జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ దేగా నారసింహారెడ్డి ఓదార్పులో పాల్గొని కడప ఎమ్పీ వైఎస్.జగన్‌ను కలిసి సంఘీభావం ప్రకటించారు. కావలిలో కాంగ్రెస్ నేత ఇంట్లో బసచేసి వున్న జగన్‌ను దేగా కలుసుకొన్నారు. జిల్లాలో చేపట్టిన ఓదార్పుకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

ఓదార్పులో జేబుదొంగల హవా

జగన్ జిల్లాలో చేపట్టిన ఓదార్పు యాత్ర వైఎస్ అభిమానులకు ఎలా వున్నా జేబుదొంగలకు మాత్రం పండుగలా వుంది. కావలి, బిట్రగుంట, బోగోలు, వింజమూరు తదితర గ్రామాలలో జేబుదొంగలు తమ చోర నైపుణ్యం ప్రదర్శించడంతో పలువురి జేబులకు చిల్లులు పడ్డాయి. నగదు, సెల్‌ఫోన్లు, ఉంగరాలు, చైన్లు తస్కరింపబడుతుండడం ఆలస్యంగా తెలుసుకొన్నవారు కుయ్యోమర్రో అంటూ పోలీస్ స్టేషన్లకు పరుగులు పెట్టారు.

మద్యం త్రాగి కలకలం సృష్టించిన కోతి

అసలే కోతి ఆ పైన మద్యం తాగింది. ఇక ఆ వానరం గురించి చెప్పాలా? అంగళ్లు పీకి పందిరేసింది. నాయుడుపేటలో జరిగిన ఈ ఘటన సంచలనం రేపింది. బస్టాండ్ సెంటర్‌లోని ఒక అంగట్లో చొరబడిన కోతి అక్కడ గందరగోళం చేసి ప్రక్కనే వున్న

కొరవ 14వ పేజీలో

అమ్మ ఫర్నిచర్స్
"A House of Life style furniture"
గృహాలంకరణకు కావలసిన అత్యాధునిక ఇంపోర్టెడ్ ఫర్నిచర్,
రాఘవ సినీకాంప్లెక్స్ రోడ్, నెల్లూరు. సెల్: 9246435616, 9849495615

కబోర్డ్స్
టేకువుడ్ ఫ్రేమ్స్
వాటర్ ప్రూఫ్ ప్లైవుడ్, రెండు వైపులా సన్‌మైకా
లేబర్, హార్డ్‌వేర్ మొత్తం కలిపి Sft. Rs. 250/-
ఫోన్: 95506 82557, 0861- 6526129

బంగారం స్పెషల్ ఆఫర్
BIS 916 హాల్‌మార్క్
బంగారు ఆభరణములపై
సవరకు రూ.400/- తగ్గింపు.
గ్రాముకు రూ.50/- తగ్గింపు.
డైమండ్స్ పై 10% తగ్గింపు.
గోల్డ్ ప్యాలెస్
హోటల్ శివం ఎదురుగా,
జిల్లా పరిషత్ ఆఫీసు సెంటర్,
ఆచారివీధి, నెల్లూరు.
ఫోన్: 2331133, 2327611



నెల్లూరులో జరిగిన యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘ సభలో మాట్లాడుతున్న విఠపు బాలసుబ్రహ్మణ్యం.

శాసన మండలికి మళ్లీ విఠపు!

గత శాసన మండలిలో పట్టభద్రుల నియోజకవర్గం నుంచి గెలిచిన విఠపు బాలసుబ్రహ్మణ్యం ఎమ్మెల్సీ పదవికి ఎంతో వన్నె తెచ్చారు. మండలిలో వివిధ చర్చల సందర్భంగా విఠపు చేసిన ప్రసంగాలు, సూచనలను ఎవరూ తిరస్కరించలేని స్థాయిలో వుండేవి. కాబట్టే మండలిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకొన్నారాయన. దీనివల్ల జిల్లాలోనూ ఆయనకు మంచి పేరొచ్చింది. జిల్లా పరిషత్ సమావేశాల్లో ఆయన చేసే సూచనలు పక్షపాతం లేకుండా వుండేవి. ఆనం బ్రదర్స్‌తోపాటు జిల్లా అధికారులందరికీ విఠపు అంటే తెలియని భయ భక్తులుండేవి. అట్లని బాలసుబ్రహ్మణ్యం ఎప్పుడూ తన హద్దులు మీరే వారు కాదు. అటువంటి ఆయన్ను రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు జిల్లాల ఉపాధ్యాయ నియోజక వర్గ అభ్యర్థిగా పోటీ చేయించాలని యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం నిర్ణయించింది. గతంలో ఈ కోటాలో పోటీచేసిన సీనియర్ ఉపాధ్యాయ నాయకుడు దాచూరి రామిరెడ్డి ఇక ఎన్నికల్లో పోటీచేయనని ప్రకటించారు. ఎమ్మెల్సీగా విఠపు, దాచూరి ఇద్దరూ తమకు వచ్చే జీతంతోపాటు ఇతర భత్యాలను యుటిఎఫ్‌కే ఇచ్చేవారు. శాసన మండలి సభ్యులుగా ప్రభుత్వం ఇస్తానన్న భూమిని సైతం వద్దని వ్రాసిచ్చారు. గత ఎన్నికల్లో నిశ్శబ్దంగా గెలిచి ట్రెండ్‌సెట్టర్‌గా నిలిచిన బాలసుబ్రహ్మణ్యంకు ఈసారి గట్టి పోటీ తప్పేట్లు లేదు. అయినా ఆయన నెగ్గుకరాగలరన్న ధీమాతో యుటిఎఫ్ మొట్టమొదటగా ఆయన్ను తమ అభ్యర్థిగా ప్రకటించింది.

ఉనికి కోసం ప్రజారాజ్యం పాట్లు



కలక్టరేట్ వద్ద ధరల పెరుగుదలపై పార్టీ నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న సిటీ ఎమ్మెల్యే శ్రీధర్‌కృష్ణారెడ్డి.

ప్రజారాజ్యం పార్టీకి జిల్లావ్యాప్తంగా అభిమానులున్నా వారిని సమాయత్తం చేసి ప్రజా సమస్యలపై పోరాటం చేసే నాయకులు లేకుండా పోయారు. కావలి నియోజకవర్గంలో రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మినహా మరో చురుకైన నాయకుడు ఆ పార్టీకి లేకుండా పోయారు. ప్రజారాజ్యం పార్టీ జిల్లా అధ్యక్షుడు, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధర్ కృష్ణారెడ్డి నగరంలో అడపా దడపా చేస్తున్న కార్యక్రమాలతో ప్రజల్లో పెద్ద గుర్తింపు రావడం లేదు. ఈ వారంలో నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలపై ఆ పార్టీ కలెక్టరేట్ వద్ద చేసిన ధర్నా ఈ కోవలోనిదే. పరిమిత సంఖ్యలో కార్యకర్తలతో నగరంలో ఆ పార్టీ జరిపిన ప్రదర్శన బోసిపోయింది. జనాన్ని ఆకట్టుకోను వేపాకు, ఆకుకూరలు తింటున్నట్లు శ్రీధర్‌కృష్ణారెడ్డి తదితరులు నటించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌కృష్ణారెడ్డి కలెక్టరేట్ వద్ద ధర్నానుద్దేశించి మాట్లాడుతూ ప్రజల ఆదాయంలో పెరుగుదల ఏటా ఐదు నుంచి పదిశాతం వుంటుందని, కానీ ధరల పెరుగుదల వంద శాతానికి పైగా వుందన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేసే కందిపప్పును కిలో నుంచి అర కిలోకు తగ్గించారని విమర్శించారు. పౌరసరఫరాల వ్యవస్థ కుప్పకూలడంతో బ్లాక్ మార్కెట్ నిల్వలు అధికమై ధరలు పెరిగాయన్నారు. ఆయిల్ ధరలపై ప్రభుత్వం నియంత్రణ ఎత్తి వేయడంతో ఇష్టానుసారంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధరల పెరుగుదలపై పార్టీ నిరసన పత్రాన్ని డిఆర్వో జయరామయ్యకు అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు ద్వారకానాథ్, వెంకటరమణ, కొణిదల సుధీర్, వెంకటేశ్వర్లు, నన్నేసాహెబ్, రామిశెట్టి కొండలరావు, క్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. మునిసిపల్ ఎన్నికలు దృష్టిలో పెట్టుకోకుండా ప్రజల కోసమైతే పోరాడను నగరంలో సమస్యలకు కొదవలేదు. కానీ ప్రజారాజ్యం పార్టీ అంటే నెల్లూరులో 'ఆనం' సోదరుల బినామీ పార్టీగా తయారయ్యింది. ఇదే కార్యకర్తల ఆవేదన కూడా!



చేపల మార్కెట్ సెంటర్‌లో విగ్రహ ఏర్పాటు దిమ్మెను కూల్చివేయడంతో ధర్నా చేస్తున్న మైనార్టీలు.

వైఎస్ విగ్రహాల ఏర్పాటును అడ్డుకొంటున్నారు

ఆనం సోదరులకు ఇదేం పాడుబుద్ధో?

జగన్మోహన్‌రెడ్డి జిల్లాలో జరిపే ఓదార్పు యాత్ర విజయవంతం కావాలని ఆనం బ్రదర్స్ ఆఫ్‌ది రికార్డ్‌గా చెబుతారు. వైఎస్ భక్తులమని పబ్లిక్‌గా ప్రకటిస్తారు. కానీ నెల్లూరు నగరంలో వైఎస్ విగ్రహాలు ఏర్పాటు కాకుండా మాత్రం బాగా అడ్డుకొంటున్నారు. జిల్లాలోని రుద్రకోటలో జగన్ ఓదార్పు యాత్ర ప్రారంభమైన క్షణంలోనే నెల్లూరు డైకస్‌రోడ్డులోని చేపల మార్కెట్ సెంటర్‌లో వైఎస్ విగ్రహ ఏర్పాటుకు కట్టిన దిమ్మెను మునిసిపల్ అధికార యంత్రాంగం జెసిబిని తెచ్చి మరీ పగులగొట్టి పారేసింది. ఇక్కడ విగ్రహ ఏర్పాటుకు కొందరు మైనార్టీలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. నెల్లూరు ఎమ్మీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఇక్కడ విగ్రహ ఏర్పాటుకు అనుమతించమని జిల్లా కలెక్టర్ ద్వారా కార్పొరేషన్‌కు ఒక లేఖ వ్రాసారు. ప్లాను ఇత్యాదులు సమర్పించారు. 12వ తేది విగ్రహ ఏర్పాటుకు అనుమతి పత్రమిస్తామని చెప్పిన కమిషనర్ 11వ తేది రాత్రి ఈ పనిచేయడమేమిటని ఈ విగ్రహ ఏర్పాటుకు శ్రమించిన బాబు ఆవేదన వ్యక్తం చేశాడు. కార్పొరేషన్ అధికారులు, పోలీసులు ఒక్కసారిగా రావడంతో ఈ సమయంలో ఒక్కడే వుండిన బాబు కాస్త హడావుడి చేసినా ఆ సమయంలో వారి బలం ముందు అతని బలం చాలలేదు. 13వ తేది రాజీవ్‌భవన్ నేత అనిల్‌కుమార్, 14వ తేది మైనార్టీలు, 15వ తేది మైనార్టీ మహిళలు ఇక్కడే వైఎస్ విగ్రహ ఏర్పాటుకు అనుమతించాలని ధర్నా చేశారు. ఆనం సోదరులను శాపనార్థాలు పెట్టారు. కానీ వారు మనసు మార్చుకోలేదు. పైపెచ్చు ఇక్కడ దివంగత కార్పొరేటర్ సందాని బాష విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామంటున్నారు. ఆనం బ్రదర్స్ విచిత్రాభిమానం వల్లే నెల్లూరు నగరంలో రాష్ట్రంలో ఎక్కడాలేనట్లు రెండు విగ్రహాలే ఆవిష్కరించనున్నారు. ఈ వ్యవహారంలో ఆనం బ్రదర్స్ శైలి ఎవరికీ అర్థం కావడం లేదు.

ఇందిరమ్మ ఇళ్లలో ఎన్నో అవకతవకలు

కొత్తూరు వైఎస్ఆర్ నగర్‌లో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలోని అవకతవకలను సిపిఎం మాజీ ఎమ్పీ పెనుబల్లి మధు బహిర్గతం చేశారు. 15వ తేది ఈ కాలనీకి విలేకరులను తీసుకెళ్లిన ఆయన ఇందిరమ్మ ఇంటి ప్లానులో బాత్‌రూం, వరండా, కరెంట్ సౌకర్యం కల్పిస్తున్నట్లు వుందని, కానీ కనీసం ఒక్క ఇంటికి కూడా ఇటువంటి సౌకర్యం కల్పించలేదని చూపించారు. ఈ ప్రాంతంలో 6,468 ఇళ్ల కట్టాల్సి వుండగా 1600 మాత్రమే అధ్వాన్నంగా నిర్మించినట్లు చెప్పారు. మిగతా ఇళ్లు ఎప్పుడు కడతారో ఆనం సోదరులే చెప్పాలన్నారు. గత కార్పొరేషన్‌లోని 28 మంది కార్పొరేటర్లకు బినామీ పేర్లతో 57 ప్యాకేజీలుగా అప్పజెప్పిన ఈ ఇళ్ల నిర్మాణం వల్ల వాళ్లు బాగుపడ్డారే కానీ పేదలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జరిగిన అవకతవకలకు ఆనం సోదరులదే బాధ్యతని మధు నొక్కి చెప్పారు. తన తండ్రి పేరిట ఏర్పాటుచేసిన ఈ కాలనీలో ఇళ్లు పూర్తయ్యేందుకు జిల్లాలో ఓదార్పు యాత్ర చేస్తున్న జగన్మోహన్‌రెడ్డి చొరవ చూపాలని మధు కోరారు. 1600 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలోనే ఇంత అవినీతి జరిగితే మిగతా వాటిలో ఎంతుందో?



వైఎస్ఆర్ నగర్‌లో అక్రమాలు వెల్లడిస్తున్న మధు.

యాక్సిడెంటు కేసులు చూడండి

ప్రైవేటు వైద్యశాలలకు ఎస్పీ సూచన

రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి ప్రైవేటు వైద్యశాలల్లోనూ చికిత్స చేయాలని ఎస్పీ దామోదర్ సూచించారు. మెడికో లీగల్ కేసుల్లో బాధితులకు కేవలం ప్రభుత్వ వైద్యశాలల్లో మాత్రమే చికిత్స చేయాలనే అపోహలను ప్రైవేటు వైద్యశాలలు విడనాడాలన్నారు. ప్రమాదాల్లో గాయపడిన వారికి మొదటి గంట చికిత్స చాలా ముఖ్యమైనదని, ఈ సమయంలో ప్రైవేటు వైద్యశాలలు చికిత్సకు నిరాకరిస్తున్నట్లు ఫిర్యాదులొస్తున్నాయన్నారు. ప్రమాదంలో గాయపడిన వారికి ప్రైవేటు వైద్యశాలల్లో చికిత్స చేయకుండా నిర్లక్ష్యం చేస్తే సంబంధిత వైద్యశాలలపై కేసు నమోదు చేస్తామన్నారు. రోడ్డు ప్రమాదం జరిగితే ఎవరైనా క్షతగాత్రులను వైద్యశాలకు తరలించవచ్చని అటువంటి వారిపై ఎలాంటి కేసులు వుండవన్నారు. ఎస్పీ గారు తీసుకున్న ఈ ఉదార నిర్ణయం వల్ల కొందరి ప్రాణాలైనా నిలిస్తే అదే పదివేలు.



ధాన్యం కొనుగోళ్లు ఆగాయి!

తాము కొనుగోలు చేసిన ధాన్యాన్ని ప్రక్క రాష్ట్రాలకు అమ్ముకొనేందుకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వనందుకు నిరసనగా మిల్లర్లు జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ఆపడంతో రైతులకు ఇబ్బందులు మొదలయ్యాయి.



రైతుల సమస్యలు పరిష్కరించలేకపోతున్న ఎఫ్‌సిఐ అధికారులు.

జిల్లాలో ధాన్యం కొనుగోలుకు బ్రేక్ పడింది. రైస్ మిల్లర్లు కొనుగోలు చేసిన ధాన్యాన్ని ప్రక్క రాష్ట్రాలకు ఎగుమతి చేసుకొనేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి రాకపోవడంతో మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయరాదని నిర్ణయించారు. ఈ నెల 15వ తేది నుంచి దీనిని అమలు చేస్తున్నారు. దీంతో అక్టోబర్ నెలలో పంట కోసిన రైతులు ఇబ్బంది పడక తప్పడం లేదు.

రెండవ పంటను కోసిన రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని అన్ని గోదాముల్లో నిల్వ చేశారు. ప్రస్తుతం గోదాములు ఎక్కడా ఖాళీ లేకపోవడంతో రైస్‌మిల్లర్లు ఏం చేయలేక పోతున్నారు. ఇప్పటి వరకు గోదాముల్లో నిల్వ వుంచిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తే గోదాముల్లో ఖాళీ ఏర్పడుతుందన్నది మిల్లర్ల అభిప్రాయం. అయితే పౌరసరఫరాలశాఖ నుంచి ఇందుకు అనుమతి రాకపోవడంతో ధాన్యం కొనుగోలు చేయలేక పోతున్నారు.

రైతులు ధాన్యం అమ్ముకోలేక ఇబ్బంది పడుతున్నా ప్రభుత్వం వైపు నుంచి ఎటువంటి స్పందన కానరావడం లేదు. రైస్‌మిల్లర్లు, పౌర సరఫరాలశాఖ అధికారులు అనాలోచిత నిర్ణయాల కారణంగా మధ్యలో రైతులు ఇక్కట్లకు గురువుతున్నారు. మరో ప్రక్క భారత ఆహార సంస్థ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం ప్రకటించింది. కానీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిత్యం మూసివేసి వుంటున్నాయి.

మార్కెట్ యార్డుల్లో బయట మాత్రం బోర్డులు దర్శనమిస్తున్నా గేట్లు మాత్రం తెరవడం లేదు. ఈ కేంద్రాల వద్ద సమాచారం చెప్పే వారు కూడా కరువయ్యారు. ప్రభుత్వం నుంచి సరైన హామీ రానందున ధాన్యం కొనుగోలు నిలిపివేసినట్లు రైస్ మిల్లర్లు చెబుతున్నారు. ప్రక్క రాష్ట్రాల్లో స్టీమ్ రైస్‌కు, ఉప్పుడు బియ్యానికి మంచి డిమాండ్ వుంటుంది. మన రాష్ట్రంలో పచ్చి బియ్యం మాత్రమే కొనుగోలు చేస్తారు.

ఇప్పటి వరకు రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిల్వ చేసేందుకు సరైన గోదాములు లేకపోవడంతో ప్రక్క రాష్ట్రాల్లో విక్ర యించుకోవడం తప్ప వేరే దారి లేదంటున్నారు. ఇదిలా వుండగా రైస్ మిల్లర్లు తీసుకున్న నిర్ణయాన్ని ఆసరా చేసుకొని కొంతమంది చిన్న వ్యాపారులు తక్కువ ధరకు ధాన్యం కొనుగోలుకు గ్రామాలకు వెళ్తు తున్నారు. పొలాల నుంచి తీసుకొచ్చిన ధాన్యం వర్షానికి ఎక్కడ తడిసి పోతుందోనని తక్కువ ధరకు అమ్ముకొంటున్నారు.

దళారులు, వ్యాపారులు నిర్ణయించిన ధరకే ఇస్తున్నారు. బయట అప్పులు చేసి వరి పంటకు పెట్టుబడులు పెట్టి వుండడంతో అప్పు తీర్చాలన్న ఒకే ఒక కారణంతో తక్కువ ధరకే ఇచ్చేస్తున్నారు. ఇదిలా వుండగా ఇక నుంచి రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి లెవీ బియ్యం ఇవ్వా లంటే పౌరసరఫరాలశాఖ ధాన్యం కొనుగోలు చేసి ఇవ్వాలని షరతు పెడుతున్నారు. ఇప్పటివరకు రైస్‌మిల్లర్లే ధాన్యం కొనుగోలు చేసి బియ్యం సరఫరా చేసేవారు.

పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు చేసి మిల్లర్లకు ఇవ్వడం రాష్ట్ర ప్రభుత్వం పరిశీలనలో వుంది. ఇది సాధ్య పడకపోతే బియ్యం సేకరణలో బాగా వెనుకబడిపోతుంది. రేషన్ షాపులకు సబ్సిడీ బియ్యం పంపిణీలో కూడా ఇబ్బందులు ఏర్పడే అవ కాశం వుంది.

వరి విత్తనాలకు కటకట!

వ్యవసాయ, ఉద్యానవన, మార్క్‌ఫెడ్ శాఖల మధ్య సమన్వయ లోపం వల్ల జిల్లాలోని వ్యవసాయ సీజన్ మొదలయ్యేసరికి నార్లు పోసుకోను వరి విత్తనాలు దొరకని పరిస్థితి నెలకొనింది.

వ్యవసాయరంగానికి సంబంధించి శాఖల మధ్య సమన్వయ లోపం కనిపిస్తుంది. నీటిపారుదలశాఖ, వ్యవసాయశాఖ, ఉద్యానవనశాఖ, మార్క్‌ఫెడ్‌ల మధ్య అవగాహన లేకుండా పోయింది. దీంతో రైతులు ఇబ్బందుల పాలయ్యే అవకాశం ఏర్పడింది. ఈ నెల 21వ తేది నుంచి జిల్లాలో ఖరీఫ్ సాగుకు నీటిని విడుదల చేస్తున్నారు. జిల్లాలో దాదాపు 5లక్షల ఎకరాల్లో వరిసాగు చేసే అవకాశం వుంది.

పెన్నా డెల్టా క్రింద 2,47,000 ఎకరాలు, కనుపూరు కాల్వ క్రింద 33వేల ఎకరాలు, కావలి కాల్వ క్రింద 72వేల 489 ఎక రాలు, నార్తుఫీడర్ కాల్వ క్రింద 28వేల 503 ఎకరాలు, సౌత్ ఫీడర్ కాల్వ క్రింద 26 వేల 708 ఎకరాలు, కండలేరు బ్రాంచ్ ఛానల్ ద్వారా 77 వేల 630 ఎకరాలకు సాగునీరందించాలని నీటిపారు దల శాఖ అధికారులు ప్రణాళికను తయారు చేశారు. నీటిపారుదల శాఖ రూపొందించిన ప్రణాళిక ప్రకారం ఇతర శాఖలు రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో వుంచాలి.

మార్క్‌ఫెడ్ అధికారులు కొంతభాగం విత్తనాలు సేకరించి సొసైటీలకు సరఫరా చేస్తున్నారు. రెండవ పంట వేసుకున్న రైతులు ఇప్పుడు ఖరీఫ్ సీజన్‌కు సిద్ధమవుతున్నారు. నారుమళ్లు పోసుకునేం దుకు అవసరమైన వరి విత్తనాల కోసం అన్వేషిస్తున్నారు. వాస్తవంగా వ్యవసాయశాఖ అధికారులు ఈ సీజన్ ఏ రకం వరి పంట వేసు కుంటే రైతులకు ప్రయోజనకరంగా వుంటుందో సదస్సు ఏర్పాటు చేసి వివరించాల్సి వుంటుంది.

అధికారుల సూచనలు, సలహాల మేరకు రైతులు వరిసాగు చేస్తారు. అయితే ఇప్పటివరకు వ్యవసాయశాఖ అధికారులు ఖరీఫ్ సాగుకు సంబంధించి ఎటువంటి ప్రకటన చేయకపోవడంతో రైతుల్లో ఆందోళన కలిగిస్తుంది. అలాగే మెట్ట ప్రాంతాల్లోని రైతులు ఏ పంట వేసుకుంటే అధిక దిగుబడి వుంటుందో తెలియజేయాల్సి వుంది. నీటి పారుదలశాఖ అధికారులు నీటి విడుదల చేసే సమయంలో ఏ కాల్వ క్రింద ఎంత విస్తీర్ణం వుందో తెలుసుకొని వ్యవసాయశాఖకు సమాచారం ఇవ్వాలి.

నీటి పారుదలశాఖ, వ్యవసాయశాఖ, ఉద్యానవన శాఖల మధ్య పూర్తిగా అవగాహన కొరవడింది. ఒకరికొకరు పొంతన లేని ప్రకటనలు చేసుకొంటున్నారే తప్ప, రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు ఎంతమేరకు అందుబాటులో వున్నా యన్న దానిపై పట్టించుకోవడం లేదు. ప్రతి సమీక్షా సమావేశంలో ఈ మూడుశాఖలు సమన్వయంగా పని చేయాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నా ఎవరు పట్టించుకొన్న దాఖలాల్లేవు.

సొసైటీ ద్వారా అందిస్తున్న వరి విత్తనాలు రైతులకు సరిపడా వుండడం లేదు. దీంతో బయట మార్కెట్లో అధిక ధరలకు కొనుగోలు చేసేందుకు సిద్ధ పడుతున్నారు. జిలకర మసూరి, నెల్లూరు సన్నాలు, 1010, 1001 రకాలకు డిమాండ్ వుంది. ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకం రైతులు వేయనున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికా రులు స్పందించి రైతులకు అవసరమైన వరి విత్తనాలు, ఎరువులు అందుబాటులో వుంచేందుకు చర్యలు తీసుకోవాలి.



నెల్లూరు ఐటిడిఏ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన అనంతరం అధికారులను అడిగి వివరాలు తెలుసుకొంటున్న తిరుపతి ఎమ్పీ డాక్టర్ చింతా మోహన్.



నెల్లూరు జూబ్లీ హాస్పిటల్ తనిఖీలో డ్యూటీ ఛార్ట్‌ను పరిశీలిస్తున్న జడ్పీ ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి.



ఎస్సీ, ఎస్టీ కేసులు త్వరితగతిన పరిష్కరించాలంటూ కలెక్టరేట్‌లో మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించిన జాయింట్ కలెక్టర్ సౌరబ్ గౌర్.



నెల్లూరు పొగతోటలోని రామకృష్ణ డయాబిటిస్ రీసెర్చ్‌సెంటర్ 15వ వార్షికోత్సవం సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న డాక్టర్ వై.రాము.

డ్రైన్లు నిర్మించాలని ధర్నా!

కావలిలో అధ్వాన్నంగా తయారైన డ్రైన్లు

కావలి పట్టణంలోగల ఆర్‌అండ్‌బి రోడ్లకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు చేపట్టాలని తెలుగు దేశం పార్టీ డిమాండ్ చేసింది. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించిన ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూనూరు రవికుమార్‌రెడ్డి మాట్లాడుతూ స్థానిక మెయిన్ రోడ్డు నుంచి ఎబిఎం స్కూలు వరకు సిసిరోడ్డు నిర్మించినప్పటికీ రోడ్డుకు ఇరువైపులా డ్రైన్లు నిర్మించని కారణంగా నీళ్లు నిలబడి పోతున్నాయని అన్నారు. అసలే పట్టణంలో డెంగ్యూ వ్యాధి విజృంభించి పలువురు ప్రాణాలు కోల్పోయిన పరిస్థితుల్లో మురుగునీరు నిల్వకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై వుందన్నారు. డ్రైన్లు నిర్మించకుండా రోడ్లు వేస్తుంటే అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైన్లు ఏర్పాటు చేయకుంటే భిక్షాటన చేసి వచ్చిన నిధులతో తామే వాటిని నిర్మిస్తామని తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు మలిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దళితుల సంక్షేమాన్ని మరచిన కాంగ్రెస్

బిజెపి పల్లెపిలుపులో విమర్శ

రాష్ట్రంలో రెండవసారి అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం దళితుల సంక్షేమాన్ని విస్మరించిందని బిజెపి దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.జయరాజ్ విమర్శించారు. బిజెపి చేపట్టిన పల్లెపిలుపులో భాగంగా బోగోలు మండలంలో పాల్గొన్న ఆయన ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై విమర్శలు చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి ఉద్యమించడంతోపాటు సంస్థాగతంగా పార్టీని దళితులకు చేరువ చేసేందుకు పల్లెపిలుపు కార్యక్రమాన్ని పార్టీ చేపట్టిందన్నారు. సంక్షేమ రంగానికి పెద్దపీట వేస్తామని చెప్తున్న పాలకులు క్రమంగా నిధుల్లో కోత విధిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు పెచ్చరిల్లాయన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు భరత్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో భూ దోపిడీ, ఖనిజ సంపద దోపిడి యదేచ్ఛగా కొనసాగుతున్నా పట్టించుకొనేవారు లేకుండా పోయారని విమర్శించారు. దేశరక్షణ, సమగ్రత, జాతి నిర్మాణమే ధ్యేయంగా బిజెపి పని చేస్తుందన్నారు.



పల్లెపిలుపులో ప్రజల సమస్యలు తెలుసుకొంటున్న జయరాజ్.

బోగోలు మండలంలోని నాగులవరం, తాళ్లూరు, అరుంధతీయవాడ, జక్కేపల్లి గూడూరు, గిరిజనకాలనీ, ముంగమూరు, సోమేశ్వరపురం, కొండ బిట్రగుంటలలో 5 రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు చక్రవర్తి, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు జనార్దన్, రవి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సుడిగుండంలో వెంకటగిరి

వెంకటగిరి పట్టణాన్ని పలు సమస్యలు చుట్టుముడుతున్నాయి. పట్టణాన్ని పట్టి పీడిస్తున్న సమస్యల్లో ప్రధానమైనది ట్రాఫిక్ సమస్య. అడ్డదిడ్డంగా వున్న ట్రాఫిక్ సమస్యను చక్కదిద్దేందుకు పోలీసులు వన్‌వే ట్రాఫిక్ అమలు చేశారు. ఈ వన్‌వేపై పలువురు పట్టణవాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ సమస్య నుంచి కొంతమేర బయటపడేలా చర్యలు చేపట్టాల్సిన పోలీసులు అవగాహన లేకుండా ఏర్పాటుచేసిన వన్‌వే ట్రాఫిక్ వలన పెద్దగా ప్రయోజనం వుండదనేది వారి అభిప్రాయం. దీని వలన అసౌకర్యాలు పెరగడం తప్ప తగ్గవని వ్యాఖ్యానిస్తున్నారు. ప్రజాసంఘాలు, రాజకీయపార్టీలు, మేధావులతో చర్చించకుండానే ట్రాఫిక్‌లో మార్పులు చేయడాన్ని పట్టణ ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. ఇక అధిక ధరలకు మద్యం విక్రయాలపై అటు రాజకీయపార్టీలు, ఇటు మహిళా సంఘాలు నిరసన వ్యక్తం చేస్తున్నాయి. దీనిపై ఎక్సైజ్‌శాఖ దృష్టిసారించి అధిక ధరలకు మద్యం విక్రయించడాన్ని అరికట్టాలని కోరుతున్నారు. అలాగే పాత బస్టాండ్ సమీపంలో ఇళ్ల మధ్య బార్ ఏర్పాటు చేయడంపై ధర్నా చేశారు. పట్టణ పరిధిలో వీధిలైట్లు వెలగడం లేదని, మంచినీటి సమస్య పరిష్కారం కావడం లేదని పలువురు నిరసనకు దిగుతున్నారు. వివిధ సంఘాలు అధికారుల దృష్టికి ఈ సమస్యలను తీసుకొనిపోతున్నా వారు పట్టించుకోకపోవడంతో వెంకటగిరిలో రోజూ ఏదో ఒక నిరసన కార్యక్రమం జరుగుతూనే వుంది.

తలనొప్పిగా మారిన ట్రాఫిక్ సమస్య

ప్రతిభావంతులకు

ప్రజారాజ్యం చేయూత!

స్వంత నిధులిచ్చిన ప్రతాప్‌కుమార్‌రెడ్డి

చదువులో ప్రతిభ కనపరచి ఆర్థికంగా ఇబ్బందుల్లో వున్న కావలి ప్రాంత విద్యార్థులకు ప్రజారాజ్యం పార్టీ ఇన్‌చార్జి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు. కాపు బలిజ సంఘం ఆధ్వర్యంలో కొందరు ఎంఎస్‌సిలో సీట్లు సాధించిన తిరుమలశెట్టి శ్రీకాంత్, మలిశెట్టి ప్రసాద్‌ల ఆర్థిక ఇబ్బందులను ప్రతాప్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లగా ఆయన తక్షణం స్పందించి ఒక్కో విద్యార్థికి 25వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ప్రకటించి తన దాతృత్వాన్ని చాటుకొన్నారు.



నెల్లూరు ఎసి సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన టేబుల్ టెన్నీస్ పోటీలలో విజేత హైదరాబాద్ జట్టుకు ట్రోఫీ బహూకరిస్తున్న మంత్రి రామనారాయణరెడ్డి. ప్రక్కన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి.

ఎలక్ట్రానిక్ కాటాలు వాడకపోతే చర్యలు

దగదర్తి మండలంలోని రేషన్‌షాపు డీలర్లందరూ విధిగా ఎలక్ట్రానిక్ కాటాలు వాడాలని తహశీల్దార్ బషీర్ ఆదేశించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు చేపడుతామని హెచ్చరించారు. ప్రజా విజ్ఞప్తుల దినం సందర్భంగా ఆయన ప్రజల నుంచి వచ్చిన పలు ఫిర్యాదులపై స్పందించారు. రేషన్ డీలర్లపై వచ్చిన ఫిర్యాదు

దగదర్తి ఎమ్మార్వో హుకుం

లపై ఆయన పై విధంగా మాట్లాడారు. అలాగే వంటగ్యాస్ సరఫరాపై అధికసంఖ్యలో ప్రజలు తమ గోడు వెళ్లబోసుకున్నారు. గ్యాస్ బుక్ చేసి నెల రోజుల గడుస్తున్నా సక్రమంగా సిలిండర్లు పంపిణీ జరగడంలేదని తెలుపగా సక్రమంగా పంపిణీ జరిగేలా చర్యలు చేపడుతామన్నారు.

ఆత్మకూరు మహిళా కాంగ్రెస్‌నేత రౌడీయిజం!

అదుపు చేయాల్సిందే



మహిళా కాంగ్రెస్ నేత దగ్గరుండి మూయించిన హోటల్ ఇదే.

ఆత్మకూరు పట్టణంలో కాంగ్రెస్‌పార్టీ మహిళానేత మహిళాలోకానికే తలవంపులు తెచ్చేలా వ్యవహరించిన తీరు వివాదాస్పదమైంది. గత కొంత కాలంగా కాంగ్రెస్‌పార్టీలో తిరుగుతూ మంత్రి ఆనంకు సన్నిహితురాలినని చెప్పుకొనే పులిమిశైలజ, కొందరు మహిళలను వెంటబెట్టుకొని స్థానికంగా వుండే హోటల్‌లో చొరబడి విధ్వంసం సృష్టించింది. పోలీస్‌స్టేషన్ ఎదుటే గల హోటల్‌పై పబ్లిక్‌గా ఇంత దాడి జరిగినా పోలీసులు చూస్తుండిపోవడం విమర్శలకు తావిస్తోంది. హోటల్ యజమాని మోహన్‌రెడ్డికి, భవన యజమాని కోటేశ్వరరావుకు మధ్య గత కొంత కాలంగా వివాదం జరుగుతోంది. కోర్టులో కేసు నడుస్తుంది. అయితే ఈ మహిళా నేత హోటల్‌ను ఖాళీ చేయించేందుకు బేరం కుదుర్చుకొని ఈ దాడికి పాల్పడిందట. మంత్రులు, కలెక్టర్, ఎస్పీలు అందరు నాకు సన్నిహితం అంటూ చెప్పుకొనే ఈ మహిళా నేత చివరకు పోలీసుల పేరుతోనూ దండకాలు సాగించడం విశేషం. ఈ మహిళపై ప్రధానంగా వున్న ఆరోపణ మహిళలను చూపి అందరినీ ఏమార్చుతుందనేదే. ఈ హోటల్ వివాదంపై ఎస్పీని సైతం బురిడీ కొట్టించిందట. హోటల్ దాడిని తెలుసుకొన్న మంత్రి ఆనం శైలజను పిలిచి చీవాట్లు పెట్టగా, అది బయటకు తెలియనీయకుండా ఎస్పీ దగ్గరకు వెళ్లి మంత్రి మిమ్మల్ని కలవమన్నాడు అని చెప్పి కేసు నుంచి బయటపడేందుకు ప్రయత్నించింది. అయితే ఇదంతా అబద్ధం అని తెలుసుకొన్న పోలీసులు ఆమెపై కఠిన చర్యలు తీసుకొనేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

కృష్ణపట్నం పోర్టు యాజమాన్యం వితరణ



నిర్వాసితులకు చెక్కులు అందజేస్తున్న ఆ సంస్థ ఛైర్మన్ విశ్వేశ్వరరావు.

కృష్ణపట్నం పోర్టు యాజమాన్యం పోర్టు అభివృద్ధితోపాటు పరిసర గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, ప్రజలకు అవసరమైన విద్యా, వైద్యం వంటి విషయాలపై దృష్టి సారిస్తుంది. ఇందులో భాగంగా కృష్ణపట్నంలో కమ్యూనిటిహాల్, హెల్త్‌సెంటర్, స్కూలు భవనాలను నిర్మించారు. వీటిని దసరా సందర్భంగా పోర్టు ఛైర్మన్ విశ్వేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా పోర్టు సిఇఓ అనిల్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలకు విద్య, వైద్యం అందించాలన్న లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కమ్యూనిటిహాల్ గ్రామస్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పోర్టు దినదినాభివృద్ధి చెందుతున్నదని తెలిపారు. ఈ సందర్భంగా ఛైర్మన్ విశ్వేశ్వరరావు నిర్వాసితుల కుటుంబానికి 5వేల రూపాయల లెక్కన 500 కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో పోర్టు ఎండి శశిధర్, పిఆర్ఓ వేణుగోపాల్, భవానీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● వెంకటగిరిలో

భూ పంపిణీ ఎప్పుడు?

ఎదురుచూస్తున్న పేదలు

వెంకటగిరి నియోజకవర్గంలో పేదలు భూమి కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూడాల్సి వస్తోంది. అధికారులు భూపంపిణీ అంటూ ఆర్భాటంగా కార్యక్రమాలు నిర్వహించి పట్టాలు ఇచ్చేస్తున్నారు తప్ప భూమిని చూపించకపోవడంతో పేదలు తమకు ఎప్పుడు భూమి చూపిస్తారో అని ఎదురు చూడాల్సి వస్తోంది. నియోజకవర్గంలోని యాతలూరు గ్రామంలో 5వ విడత భూపంపిణీ క్రింద 150 మంది లబ్ధిదారులకు 300 ఎకరాల భూమిని పంపిణీ చేశారు. భూమి పంపిణీ చేస్తున్నట్లు చెప్పి పట్టాలు చేతికిచ్చిన అధికారులు ఆ భూమి ఎక్కడుందో చెప్పలేదు. మరోచోట గతంలో భూపంపిణీ చేసిన ప్రాంతంలో బయట వ్యక్తులు మినుము పంట సాగు చేస్తున్నారు. ఈ విషయాన్ని లబ్ధిదారులు అధికారుల దృష్టికి తీసుకొనిపోయినా పట్టించుకోలేదు. మరోవైపు వెంకటగిరి, డక్కిలి మండలాల్లో భూఆక్రమణలు అడ్డూ ఆపు లేకుండా జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో అటవీ పోరంబోకు భూములు అధికంగా వుండడంతో కొందరు పెద్దల కన్ను వీటిపై పడింది. ఎస్ఎస్ కెనాల్ రావడం కూడా ఈ ఆక్రమణలకు ఒక కారణంగా తెలుస్తోంది. డక్కిలి మండలంలోని ఆల్తూరుపాడు, వడ్డిపల్లి, కుప్పాయపాళెం, మాధవాయపాళెం, సిద్ధగుంట గ్రామాల్లో ఈ భూఆక్రమణలు అధికంగా వున్నాయి. ఇప్పటికైనా అధికారులు వీటిపై దృష్టి సారించి భూ ఆక్రమణలను అడ్డుకోవడంతోపాటు, పేదలకు భూములను అందచేయాల్సి వుంది.

అల్లూరులో నీటికి కటకట

అల్లూరు పంచాయితీ పరిధిలోని ప్రజలు మంచి నీటి కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గ్రామ పరిధిలో ఏర్పాటుచేస్తున్న పైపులైను పనులపై నెలకొన్న వివాదం కాస్తా ప్రజలకు ఇబ్బందులు తెచ్చిపెట్టింది. గొంతు తడుపుకొనేందుకు గుక్కెడు నీళ్ల కోసం గ్రామస్తులు బయట ప్రాంతాలకు వెళ్లాల్సి రావడంతో గోడు గోడు మంటున్నారు. పైలట్ ప్రాజెక్టు ద్వారా పదిలక్షల రూపాయలతో పైపులైన్ల

అధికార్ల అవగాహనా లోపమే కారణం

పనులు చేపట్టారు. ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది అవగాహనా లోపంతో సాంకేతిక సమస్య ఏర్పడింది. ఈ సందర్భంగా మంచినీటి పైపులైన్లకు వాల్వ్‌లు ఏర్పాటుచేసే విషయమై వివాదం నెలకొనింది. కాంట్రాక్టర్ చేపడుతున్న పనులపై స్థానికులు నిరసనకు దిగారు. గొడవ పెద్దది కావడంతో గ్రామ కార్యదర్శి చక్రం వెంకటేశ్వర్లు జోక్యం చేసుకొని అన్ని ప్రాంతాల వారికి ఎలాంటి అంతరాయం లేకుండా మంచినీటిని సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో ప్రజలు శాంతించారు.

విద్యుత్ స్థంబాలు వేసి సరిపెట్టుకొన్నారు

తాళం వేసితిమి గొళ్లెం మరచితిమి అన్న చందంగా వుంది. కావలి పట్టణంలో ట్రాన్స్‌కో అధికారుల తీరు. పట్టణంలోని జొన్నాయగుంట ప్రాంతంలో పలు చోట్ల విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి చాలా కాలమైనా కనెక్షన్లు ఇవ్వడం మరిచారు. దీని వలన ఆ ప్రాంత ప్రజలకు విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయి. అధికారులు దీనిపై దృష్టి సారించి స్తంభాలకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని స్థానికులు కోరుకొంటున్నారు.

బోగోలులో పడకేసిన పారిశుధ్యం!

బోగోలు మండలంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారడంతో పలు గ్రామాల ప్రజలు రోగాలతో అల్లాడిపోతున్నారు. మండలంలో 12 పంచాయితీల్లో 26 గ్రామాలు వున్నాయి. గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితులను మెరుగుపరచేందుకు పంచాయితీ పాలకవర్గం, అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. దోమల కారణంగా పలువురు విషజ్వరాల బారినపడి ఆస్పత్రి పాలవుతున్నారు. దీనికి తోడు పందుల సంచారం అధికంగా వుంటోంది. జిల్లా అధికారులు ఆదేశిస్తే ఆయా గ్రామాల్లో మొక్కుబడిగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి చేతులు దులుపుకోవడం మినహా గట్టి చర్యలు చేపడుతున్న దాఖలాలు లేవు. పలు గ్రామాలు చెత్తకుప్పలతో నిండి వుంటున్నాయి. ఎక్కడ పడితే అక్కడ చెత్తను పారవేయడంతో దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి. దీనికి తోడు త్రాగునీరు కలుషితం

అన్ని పంచాయితీలలోనూ ఇదే పరిస్థితి.


అయ్యి పలువురు డయేరియా బారిన పడ్డారు. ఇంతగా ప్రజల ఆరోగ్యం పాడవుతున్నా నీటిని క్లోరినేషన్ చేయించేందుకు, చెత్తను శుభ్రపరిచేందుకు ఎవరూ పూనుకోకపోవడంతో బోగోలు మండల ప్రజలు ఆస్పత్రుల పాలవ్వాల్సి వస్తోంది.

వివేకా మౌనం!



రాష్ట్రంలోనే పెద్ద నోరు గల రాజకీయనేతల్లో ఒకడైన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి దసరా శరన్నవరాత్రులు ముగిసే వరకు ఎవరిని పరుషంగా మాట్లాడలేదు. దీనికి కారణం ఆయన రాజరాజేశ్వరమ్మ సన్నిధిలో రోజుకు 108 ప్రదక్షిణాలు చేయడమని అందరికీ తెలిసిందే. ఇదే అదనుగా నెల్లూరులో జగన్ ఓదార్పు యాత్ర పర్యవేక్షణకు వచ్చిన ఆర్టీసి మాజీ ఛైర్మన్ గోనె ప్రకాశరావు, ఏపీఐఐసీ మాజీ అధ్యక్షుడు అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్, కాంగ్రెస్ నెల్లూరు నగర ఇన్‌ఛార్జి అనిల్‌కుమార్ నానా రకాలుగా విమర్శించినా తిరిగి వారిని పల్లెత్తు మాట అనలేదు. పండుగ ముగిసింది కాబట్టి ఇక వివేకా గొంతు సవరించుకొని తనను తిట్టిన వారిని తూర్పారపట్టను రంగం సిద్ధం చేసుకొంటున్నాడు. అది ఈ రోజో రేపో కావచ్చు.

రాజేశ్వరమ్మపై పెత్తనం




నెల్లూరు దర్గామిట్టలో వెలసిన రాజరాజేశ్వరమ్మ మహిమలు గూర్చి ఎంత చెప్పుకొన్నా తక్కువే అవుతుంది. నమ్మిన భక్తులకు కొంగు బంగారమామె. అటువంటి దేవస్థానానికి వంశపారంపర్య ధర్మకర్త వున్నాడు. దేవాదాయశాఖ నియమించిన పాలకవర్గ సభ్యులున్నారు. కాని వీరెవరి మాట ఇక్కడ సాగదు. రాజరాజేశ్వరమ్మ సేవా సమితి అధ్యక్షుని పేరిట మాజీ కార్పొరేటర్ సన్నపురెడ్డి పెంచలరెడ్డి దేవాలయాన్ని తన ఆధీనంలోకి తీసుకొన్నారు. కళ్యాణ మండపంలో ఆయన భవానీల పేరిట తిష్టవేశారు. దేవస్థానంలో ఇఓ డమ్మీ కావడంతో ఈయన చెప్పినట్లే పాలన సాగుతోంది. ఈయనగారు దసరా ఉత్సవాల్లో పలుకుబడి పెంచుకోను సామాన్యులకు అమ్మవారిని దూరం చేసి వివిపిలకు దగ్గరుండి దర్శనం చేయించారు. రాజరాజేశ్వరమ్మపై ఈయన పెత్తనం ఏమిటని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వెజ్ పెరిగింది - నాన్‌వెజ్ తగ్గింది!



శరన్నవరాత్రులను పురస్కరించుకొని నగరంలో పలువురు ప్రతి నిత్యం దేవాలయాలకు వెళ్లనారంభించారు. వీరిలో 90శాతం మంది దేవీ పూజను పురస్కరించుకొని శాకాహారం మాత్రమే... అదీ ఓ పూట తిని సరిపెట్టుకొన్నారు. వీరంతా పదిరోజుల పాటు మాంసాహారాన్ని ముట్టకపోవడంతో చేపలు, రొయ్యలు, చికెన్ ధరలు బాగా తగ్గాయి. చేపలు, మాంసం మార్కెట్‌లో జనం లేక వ్యాపారులు ఈగలు తోలుకొంటూ కనిపించారు. శరన్నవ రాత్రులకు ముందు బాగా తగ్గి వుండిన కూరగాయల ధరలు దసరాను పురస్కరించుకొని 300 శాతానికి పెరిగాయి. కిలో ఐదు రూపాయలు అమ్ముతుండిన నెల్లూరు వంకాయ, బెండకాయ ఏకంగా 20 రూపాయలవ్వగా, క్యారెట్, బీట్‌రూట్, బీన్స్ 30 రూపాయలయ్యాయి. పండుగ నెపంతో పెరిగిన ధరలు ఎప్పుడు తగ్గుతాయని సామాన్యులు ఎదురు చూస్తున్నారు.

మందులోళ్లు... మాయలోళ్లు!



మందులోడా... ఓరి మాయలోడా సినిమా పాటను గుర్తు చేస్తున్నారు నెల్లూరు నగరంలోని మందుల షాపుల నిర్వాహకులు. నగరంలో నడిచే మందుల షాపుల్లో 75శాతం మంది డూప్లికేట్ మందుల వ్యాపారంలో ప్రసిద్ధులు. మందుల చీటీపై డాక్టర్ బ్రాండెడ్ మందులను వ్రాస్తే వాళ్లు వాటిని పోలిన డూప్లికేట్ మందులిచ్చేస్తారు. వీరి పాలిట నగరంలో రెడ్‌క్రాస్ సంస్థ పెట్టిన జెనరిక్ మందుల షాపు కల్పవృక్షంలా మారింది. ఇక్కడమ్మే మందుల షీట్లపై ఎక్కువ రేట్లు వున్నా దానిపై నాలుగోవంతు రేటుకు వారు అమ్ముతున్నారు. ఈ రేట్లకు జెనరిక్ మందులను అక్కడ నుంచి తెచ్చుకొంటున్న కొన్ని మందుల షాపుల యజమానులు షీట్‌పై వున్న రేట్లకు రోగులకు అమ్ముతూ ఏ మాత్రం కష్టపడకుండా లాభాలార్జిస్తున్నారు. జెనరిక్ మందులన్నీ ప్రముఖ బ్రాండెడ్ కంపెనీలవే కావడంతో ఏవి అసలో ఏవి నకిలీలో తెలుసుకోవడం సామాన్యులకు సాధ్యం కావడం లేదు.

రౌడీల ఇంటికి అనుకోని అతిథి!



నెల్లూరు నగరం ప్రశాంతమని అందరూ చెప్పినా తెలియని ఘాతుకాలు నిశ్శబ్దంగా జరుగుతుంటాయి. పరిశ్రమల ఏర్పాటు, రియల్ ఎస్టేట్ వ్యాపారం ఓ మోస్తరుగా నడవడం వంటి కారణాలతో భూదందాల్లో రౌడీషీటర్లు పాలుపంచుకొంటున్నారు. వీరు వృత్తిలో పాల్గొనడం లేదని ఎస్ఐలు చెబుతుండడంతో గతంలోని వేగుల తరహాలో నగర సిఐ వీరాంజనేయరెడ్డి పేరుమోసిన రౌడీషీటర్ల ఇంటికి నేరుగా వెళ్లారు. వారి కుటుంబసభ్యులతో కలుపుగోలుగా మాట్లాడుతూ రౌడీషీటర్ల గతివిధులు తెలుసుకొన్నారు. విచిత్రమేమిటంటే పలువురు రౌడీల భార్యలు నిజాయితీగా తమ భర్తలను సంస్కరించమని సిఐని కోరారు. సిఐ ఈ విషయంలో కుటుంబసభ్యులను సహకారమందించమన్నారు. మొత్తం మీద దసరా పండుగ ముందు 40 మంది రౌడీషీటర్ల ఇంటికి అనుకోని అతిథిగా సిఐ వెళ్లి వచ్చిన విషయం ట్రంకురోడ్డులో చర్చనీయాంశమయ్యింది.




తెలుగుదనం ప్రతిబింబించే పండుగ అట్లతద్ది!

తెలుగువారి ముఖ్య పండుగలలో అట్లతద్ది ఒకటి. ఆశ్వీయుజ బహుళ తదియనాడు ఈ పండుగను జరుపుకోవడం ఆనవాయితి. అట్లతద్ది పండుగలో విశేషం వయస్సుతో సంబంధం లేకుండా స్త్రీలందరూ జరుపుకోవడం. ఈ పండుగకు సంబంధించి ఒక పురాణ కథనం వుంది. పార్వతిదేవి శంకరుడిని భర్తగా పొందదలచి తపస్సు చేస్తుంది. ఆ తపస్సు ఫలితంగా శివుడు ప్రత్యక్షమై ఆమె మనోభీష్టాన్ని నెరవేరుస్తాడు. హిమపుత్రి గౌరీ దేవి తపస్సు చేసి తన కోర్కెను తీర్చుకొన్నందున ఆనాడు పార్వతి దేవిని పూజించి వ్రతమాచరించినట్లయితే సకల శుభాలు కల్గుతాయని, కోరిన కోర్కెలు తీరుతాయని పురాణాలు చెప్తున్నాయి. ఈ యేడాది అక్టోబర్ 25వ తేది అట్లతద్ది పండుగ.

స్త్రీలందరూ అటు ఆటపాటలు, ఇటు ఉమావ్రతం చేసే పండుగ అట్లతద్ది. ఆశ్వీయుజ బహుళ తదియనాడు సూర్యోదయానికి ముందే లేచి స్నానం చేసి శుభ్రమైన బట్టలు ధరించిన స్త్రీలు చద్దన్నం గోంగూర పచ్చడి, పెరుగు కలిపిన ఆహారాన్ని తీసుకొంటారు. తర్వాత పాటలు పాడుతూ, ఆటలాడుతూ ఉల్లాసంగా గడుపుతారు. చెట్లకు ఊయల కట్టి ఉయ్యాలూగుతారు. ఈ సందర్భంగా వివాహిత, అవివాహిత స్త్రీలు, పిన్నలు, పెద్దలు అనే తేడాలేకుండా మహిళలందరూ ఉల్లాసంగా గడుపుతారు. చంద్రోదయం అయిన తర్వాత ఉపవాసం విరమిస్తారు. తూర్పు ముఖంగా గౌరీదేవి ప్రతిమ వుంచి పూజిస్తారు. అట్లు వేసుకొని పార్వతికి నివేదన చేస్తారు. వినాయకుడిని పూజిస్తారు. గౌరీ స్తోత్రాన్ని పఠించి ముత్తైదువలకు వాయనం ఇస్తారు. చంద్రారాధన ప్రధానంగా సాగే ఈ పండుగలో ఆరోగ్య సంబంధిత విషయాలు అంతర్లీనంగా కన్పడుతాయి. ఉదయాన్నే లేచి గోంగూరతో కూడిన పెరుగన్నం తినడం ఆయుర్వేద ప్రక్రియలో ఉత్తమమైనది. తాడాట, ఊయలలూగడం చాదస్తంగా కొట్టేసినా ఈ ఆటలలో స్త్రీ ఆరోగ్యానికి మేలు జరిగేవి ఇమిడి వున్నాయి. తాడాట ఆడటం వలన గుండె జబ్బులు రాకుండా వుండేందుకు, ప్రత్యుత్పత్తి సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇవి దోహదం చేస్తాయి. అట్లు తయారీకి వాడే మినుములు, బియ్యం తదితర వస్తువులు బలవర్ధకమైనవి. అటు గౌరీ శంకరుల కృపతోబాటు ఆరోగ్యానికి మంచి చేసే పండుగ అట్లతద్ది. పలు ప్రదేశాలలో మహిళలు ఈ పండుగ సందర్భంగా చెరువులు, నదుల్లో దీపాలు వదులుతారు. గోరింటాకు పెట్టుకోవడం ఆనవాయితి. అందుకే దీనిని గోరింట పండుగ, ఊయల పండుగ అనికూడా అంటారు. భక్తి శ్రద్ధలతో అట్లతద్ది నాడు ఉమా వ్రతాన్ని ఆచరించినట్లయితే అవివాహిత స్త్రీలకు గుణవంతుడు, రూపసియైన భర్త లభిస్తాడని, వివాహితులకు సౌభాగ్యం కల్గుతుందని పురాణాలు చెప్తున్నాయి.

'ఖాన్' వైరాగ్యం




హైదరాబాదు నగర పోలీస్ కమిషనర్ ఖాన్ వైరాగ్యంలో పడినట్లున్నాడు. నిన్న మొన్నటిదాకా నగర పోలీసు విభాగంలో నెంబర్ టూ, త్రీగా వుండిన ఖాన్ కమిషనర్‌గా నియమించబడటంతో నెంబర్ వన్ అయ్యాడు. అయితే ఖాన్ పదవీ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి అటు రాజకీయంగా, ఇటు శాంతిభద్రతల దృష్ట్యా నగరంలో సమస్యలు పెరిగిపోయాయి. అయితే లౌక్యంతో ఎప్పటికప్పుడు పరిస్థితుల్ని చక్కదిద్దుకుంటూ వస్తున్నా... నేరాల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతుండటంతో ఖాన్‌కు నిద్ర కూడా పట్టడం లేదట. దీంతో ఏమనుకున్నాడో ఏమో గానీ ఈ కమిషనర్ పదవి వద్దు బాబోయ్ అంటూ సన్నిహితుల వద్ద వాపోతున్నాడట. ఆ మధ్య విలేకరుల దగ్గర కూడా ఖాన్ తన బాధను పంచుకున్నాడు. రాబోయే రోజుల్లో నగర కమిషనర్‌గా పని చేయడం కష్టమేనంటూ తెగ బాధపడిపోయాడు. పాపం!

'బాబు' రోడ్డున పడ్డాడు!




చంద్రబాబు రోడ్డున పడ్డాడు. మంగళవారం హైదరాబాదుకు వచ్చిన ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు వినతి పత్రం యివ్వడానికి మిత్రపక్షాలతో కలిసి చంద్రబాబు ప్రయత్నించినపుడు పోలీసులు అడ్డుకున్నారు. దీంతో 'బాబు' రోడ్డు మీద బైఠాయించి నిరసన తెలిపాడు. 'బాబు' యిలా రోడ్డు మీద బైఠాయించిన దృశ్యం తెలుగు తమ్ముళ్లకు కొత్తగా కనిపించింది. ఎప్పుడూ తెర వెనుక నుంచే రాజకీయం చేయడం 'బాబు' అలవాటు. అయితే కార్యకర్తలకు, ప్రజలకు దగ్గర కావాలని బాబు యిటీవల నుంచి 'రూటు' మార్చాడు. రోడ్డెక్కడం, అరెస్ట్ కావడం యిప్పుడు బాబుకు మెల్లమెల్లగా అలవాటవుతోందని తెలుగు తమ్ముళ్లతోపాటు, కామ్రేడ్లు కూడా తెగ సంతోష పడుతున్నారు.

మిల్లర్ రోశయ్య



ముఖ్యమంత్రి రోశయ్య రైస్ మిల్లర్ల పట్ల అనుకూలంగా వుండడంతో స్వపక్షంలోనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో కూడా రోశయ్య రైస్‌మిల్లర్ల పక్షపాతిగా ఆరోపణల్ని ఎదుర్కొన్నాడు. అయితే ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఏకపక్షంగా మిల్లర్లకు లబ్ధిని చేకూరుస్తున్నాడంటూ పలువురు మంత్రులు చెవులు కొరుక్కుంటున్నారు. బియ్యంపై ప్రస్తుతం వున్న ఆంక్షల్ని తొలగించి మిల్లర్లకు పర్మిట్లు జారీ చేయడానికి రోశయ్య సుముఖంగా వుండటం స్వపక్షీయులతోపాటు ప్రతిపక్షాలకు కూడా నచ్చడం లేదు. అయితే పిసిసి అధ్యక్షుడు డి.శ్రీనివాస్ మాత్రం ఈ విషయంలో రోశయ్యకు మద్దతు తెలుపుతున్నాడు. దీంతో గుడ్డిలో మెల్లలా రోశయ్య సంబరపడుతున్నాడట. మొత్తానికి రోశయ్య గతాన్ని మరచిపోకుండా మిల్లర్ మిత్రులకు లాభం చేకూర్చడానికి తన వంతు కృషి చేస్తున్నాడు.

స్పీకర్‌కు చిదంబర హస్తం



శాసనసభ స్పీకర్ కిరణ్‌కుమార్‌రెడ్డికి కేంద్ర హోంమంత్రి చిదంబరం ఆశీస్సులున్నాయా? రోశయ్య సామాజిక వర్గానికి చెందిన చిదంబరం భవిష్యత్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా కిరణ్‌కుమార్‌రెడ్డిని ప్రతిపాదిస్తున్నాడన్న వార్త రాజధానిలో గుప్పుమంటోంది. వై.ఎస్ మరణం తర్వాత రోశయ్యను సిఎం కుర్చీలో కూర్చోబెట్టడంలో చిదంబరం ముఖ్యపాత్ర వహించాడు. ఆ తర్వాత కూడా రోశయ్యకు వెన్నుదన్నుగా వుంటూ కాపాడుకుంటూ వస్తున్నాడు. అయితే రోశయ్య మాత్రం తన స్థానాన్ని పదిలం చేసుకోవడంలో విఫలమవుతున్నాడు. దీంతో రోశయ్యను మార్చి మరో వ్యక్తిని ముఖ్యమంత్రిగా తేవాలని అధిష్టానం ఆలోచిస్తున్న నేపథ్యంలో చిదంబరం తన తరపున కిరణ్‌కుమార్ పేరును తెరపైకి తెచ్చాడట. విషయం తెలుసుకున్న దగ్గర నుంచి 'కిరణ్' ప్రవర్తనలో మార్పు కనిపిస్తోందట. దీనిపై రోశయ్య కూడా గుర్రుగా వున్నట్లు గాంధీభవన్‌లో చెవులు కొరుక్కుంటున్నారు.

పోలీసు అమర వీరుల సంస్మరణ దినం

అక్టోబర్ - 21



కంటి నిండా కునుకు తీయడు
ఖాకీ బట్టను ఒంటిని విడవడు
మడమ త్రిప్పని మహాయోధుడు
మన వాడే ఈ పోలీసు అమరుడు

దేశం కోసం ఆహుతి అయ్యింది మీ జీవితం
బాష్పాంజలి ఘటిస్తుంది మీకు యావద్భారతం
ప్రజా సేవ చేస్తూ విధి నిర్వహణలో అశువులు బాసిన
పోలీసు అమరవీరులకు జోహార్లు!!

నేటి మన నిశ్చింత జీవనం - వారి అవిశ్రాంత త్యాగఫలం
అందుకే ఆ అమరవీరులను స్మరించుకొందాం



ఇ.దామోదర్, I.P.S
సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్
ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరు జిల్లా.

జి.ఆర్. రాధిక
సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్
నెల్లూరు సిటీ.

పి. వీరాంజనేయరెడ్డి
ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్
నెల్లూరు సిటీ.

జి. దశరధరామారావు
సబ్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ పోలీస్, 4th town P.S., నెల్లూరు.

పి.శ్రీనివాసులరెడ్డి
సబ్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ పోలీస్, 5th town P.S., నెల్లూరు.

జి.మంగారావు
సబ్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ పోలీస్, 1 town P.S., నెల్లూరు.

పి.పెంచలరెడ్డి
సబ్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ పోలీస్, 3 town P.S., నెల్లూరు.


SRAMAYEVA JAYATHE
THE NARAYANA GROUP
నారాయణ
విద్యాసంస్థలు - నెల్లూరు.

HOTEL ★★★
Abhiram
23/931 & 932, Near Madras Bus Stand, Achari street, Nellore - 524003.
Ph:2347477, 79, 80 Fax: 2347482, Cell: 99894 86868



మేషం
అశ్వని, భరణి, కృత్తిక 1 పా

మిత్రులతో సమాగమం. తద్వారా అనుకొన్నవి సాధిస్తారు. ధనాదాయం తృప్తికరంగా ఉంటుంది. వృత్తి ఉద్యోగాల్లో కోరుకొన్న మార్పులు చేర్పులు జరిగే సూచనలు. బంధువుల మూలంగా చిరు ఖర్చులు. ఆరోగ్యం చక్కగా ఉంటుంది. ప్రభుత్వం ద్వారా ఆదాయాలు. ప్రేమికులకు కొత్త అనుభూతులు చోటుచేసుకొంటాయి. వృత్తిప రులు మూర్ఖత్వం వల్ల నష్టపోయే అవకాశాలున్నాయి.



వృషభం
కృత్తిక 2,3,4 పా. రోహిణి, మృగశిర 1,2 పా

శుభపరంపరలనందుకొనే కాలం. వినోదాలతో కాలక్షేపం చేస్తారు. సంతాన మూలకంగా ఖర్చులు. నూతన వ్యక్తులతో పరిచ యం ఏర్పడుతుంది. తోటివారితో అభిప్రాయభేదాలు తొలగుతాయి. అప్పులు తీరుస్తారు. విరోధాలు పాటించేవారిపై మీదే పై చేయి. దైవ పూజా కార్యక్రమాలలో పాలుపంచుకొంటారు. నూతనవ్యక్తులతో మెలకువగా నడచుకోవాలి. దూరప్రయాణాలు నిరుపయోగాలు.



మిథునం
మృగశిర 3,4 పా. ఆర్ద్ర,పునర్వసు,1,2,3 పా

భగవతారాధన వైపు మనసు పోనిస్తారు. మిత్రులతో కలసి వినోదయాత్రలు చేసే అవకాశాలున్నాయి. పురోభివృద్ధికి సహాయ సహకారాలందించే వారితో మైత్రి ఏర్పడుతుంది. వ్యాపారవిస్తరణకు నూతన ప్రయత్నాలు చేస్తారు. సంతాన కారణంగా మనశ్చింత. నూతన విషయావగాహనకై యావ. మోసపోయే అవకాశాలున్నాయి జాగ్రత్త. భూసంపదను పెంచుకొనే యోచన చేస్తారు.



కర్కాటకం
పునర్వసు 4 పా. పుష్యమి, ఆశ్లేష

సమాజ కార్యక్రమాలలో పాల్గొంటారు. గౌరవ మర్యాదలు చక్కగా లభిస్తాయి. సోదరుల తోడ్పాటు, వృత్తి వ్యాపారాలలో పురోభి వృద్ధి చక్కగా ఉంటుంది. చిన్న చిన్న విరోధాలు మనశ్శాంతిని చెద గొడతాయి. వృథా వాదాలకు దిగవద్దు. సంతానానికి సంబంధిం చిన విషయాల్లో అతిశ్రద్ధతో ముఖ్యమైన నిర్ణయాలు తీసుకొంటారు. సహోద్యోగుల, అధికారుల సహాయ సహకారాలు లభిస్తాయి.



సింహం
మఖ, పుబ్బ ఉత్తర 1 పా

ప్రియ వార్తాశ్రవణం. కుటుంబంలో మీ పలుకుబడి పెరుగు తుంది. నూతన వస్త్రాదులు ధరించి ఎంతో సంతోషంగా కానవస్తారు. ప్రముఖుల సహాయ సహకారాలు అందుతాయి. ధనసంపదలు, ఆస్తి పెంపుదల సూచన. జీవశక్తి చక్కగా ఉంటుంది. దూర వార్తా శ్రవణం ప్రయోజనకారి. గృహాలంకరణ విషయాలలో ఆసక్తి చూపు తారు. భాగస్వామ్య విషయాలపై శ్రద్ధ చూపిస్తారు.



కన్య
ఉత్తర 2,3,4పా, హస్త, చిత్తా 1, 2 పా

నిరీక్షణ చేస్తూ ఉండిన వ్యక్తుల్ని కలుసుకొంటారు. దైవా రాధన, పుణ్యక్షేత్రాటన వైపు మనసు పోనిస్తారు. చేతిలో చిల్లి గవ్వ నిలవదు. వచ్చినది వచ్చినట్లుగానే ఖర్చు అవుతుంది. ఆర్థికసమస్య లున్నా మనోధైర్యం కోల్పోరు. చేతికందిందంతా పూర్తిగా ఖర్చు చేస్తారు. ఇతరుల విషయాల్లో జోక్యం చేసుకొని ఇబ్బందులు కొని తెచ్చుకోవద్దు. కళత్రసంబంధం కొంతవరకు మెరుగు.

వారఫలాలు

తేది 23-10-2010 నుండి 29-10-2010 వరకు తులలో రవి, బుధ, శుక్రులు; కన్యలో శని; మీనంలో గురువు; వృశ్చికంలో కుజుడు; ధనుస్సులో రాహువు; మిథునంలో కేతువు; మేష, వృషభ, మిథునాల్లో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగం


24తేది శుక్రమౌఢ్యమి ప్రారంభం.
25తేది అట్ల తద్ది.

శుభ ముహూర్తాలు లేవు.

అక్టోబర్ తిథులు
ఆశ్వయిజ శుద్ధ

23	శని	పౌర్ణమి	ఉ.7.02	గం.ల.వ
		ఆశ్వయిజ శుద్ధ		
24	ఆది	పాడ్యమి	ఉ.8.11	గం.ల.వ
25	సోమ	విదియ	ఉ.8.57	గం.ల.వ
26	మంగళ	తదియ	ఉ.9.22	గం.ల.వ
27	బుధ	చవితి	ఉ.9.23	గం.ల.వ
28	గురు	పంచమి	ఉ.9.01	గం.ల.వ
29	శుక్ర	షష్ఠి	ఉ.8.13	గం.ల.వ

పి.ఎం.గోపాలాచారి
16/1020, పొగతోట, నెల్లూరు – 1.
E-mail:maripmgg@yahoo.com



తుల
చిత్తా 3,4 పా, స్వాతి, విశాఖ 1,2,3 పా

ఇల్లుమార్పిడి, స్థలమార్పిడుల గురించి చింతిస్తారు. ఇంటికి సంబంధించి దుబారా ఖర్చు చేస్తారు. దూరప్రయాణావకాశాలు కానవస్తున్నాయి. మనశ్శాంతికై దేవాలయాలకు వెళతారు. వివిధ మార్గాలలో ధనప్రాప్తి. అనుకూల వాతావరణం. వ్యాపారులు భాగ స్వాములతో సఖ్యంగా ఉండడానికి ప్రయత్నించండి. పూజాదులు బృందకార్యక్రమాలు విజయవంతంగా సాగుతాయి.



వృశ్చికం
విశాఖ 4 పా, అనూరాధ, జేష్ఠ

విందు వినోదాలలో ముఖ్యపాత్ర వహిస్తారు. చాలాకాలంగా ప్రయత్నిస్తూ వచ్చిన పనులు ఈ వారంలో జరుగుతాయి. పుర ప్రముఖుల పరిచయం ఆనందాన్నిస్తుంది. జాయింటు వ్యవహారాలు చక్క దిద్దుకొంటాయి. ఆకస్మిక సంఘటనలకు అవకాశాలున్నాయి. ఇతరులతో అభిప్రాయభేదాలు రావచ్చు. వ్యాపారులు భాగస్వాము లతో జాగ్రత్తగా మెలగాలి. ఏకాగ్రత పెరుగుతుంది.




ధనస్సు
మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా

ఇంటిలో ఆనందదాయకమైన పరిస్థితులు చోటు చేసుకొం టాయి. ఆర్థికవృద్ధికి, పొదుపునకు సంబంధించి చేసే పనులు ఫల వంతమవుతాయి. వృత్తివ్యాపార రీత్యా కొత్త ఒప్పందాలు చేసుకొం టారు. ప్రభుత్వం నుండి ఆదాయావకాశాలు. శుభ వార్తాశ్రవణం. ఆరోగ్య విషయాలు అనుకూలం. ఇతరులతో అభిప్రాయభేదాలు కొంతవరకు తొలగుతాయి. ఆదాయమున్నా ఖర్చులు అధికం.



మకరం
ఉత్తరాషాఢ 2, 3,4 పా. శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా

బంధుమిత్రుల సమాగమం సుఖసంతోషాల నిస్తుంది. శ్రమకు తగ్గ ఫలితం లభిస్తుంది. గొప్పవారి వద్ద మీ సామర్థ్యాన్ని ప్రకటించి సన్మానింపబడతారు. వ్యాపారవృద్ధికై అప్పులు చేస్తారు. అనుకొన్న పనులు చక్కగా నిర్వహిస్తారు. ఉద్యోగ వృత్తి విషయాలు చక్కగా సాగుతాయి. రియల్ ఎస్టేట్ వ్యవహారాలు ఒకమోస్తరుగా ఊపందు కొంటాయి. గృహసంబంధమైన వస్తువులు కొంటారు.



కుంభం
ధనిష్ఠ 3,4 పా. శతభిషం, పూర్వ భాద్ర 1,2,3 పా

శుభకార్యాలకై ఖర్చులు చేస్తారు. ఇరుగుపొరుగువారిని అను సరించి పోవడం మంచిది. ఇచ్చిన మాట నిలబెట్టుకోలేని పరిస్థితి ఏర్పడవచ్చు. భగవంతుని ధ్యానానికి కొంతకాలం వెచ్చించాలి. విజయవంతంగా పనులు సాగుతాయి. అధికారుల నుండి కొంత ఆదరణ. అప్పులు తీరుతాయి. సంఘంలో ప్రసిద్ధినందిన వారి సమా గమం మంచి భవిష్యత్తుకు పునాది వేస్తుంది.



మీనం
పూర్వాభాద్ర 4 పా, ఉత్తరాభాద్ర, రేవతి

సమాజంలో కొత్తవారితో పరిచయాలు ఏర్పడుతాయి. ఇష్ట లైనవారితో సమాగం వుంటుంది. మిత్రులు సాయమందించడా నికి ముందుకు వస్తారు. కుటుంబ సభ్యులతో గొడవలకు అవకాశా లున్నాయి. వృథా ప్రయత్నాలు. వ్యాపారులు పెట్టుబడులపై ముఖ్య నిర్ణయం తీసుకొంటారు. ఉద్యోగులకు పై అధికారుల వైఖరివల్ల మనశ్శాంతి కొరవడుతుంది.

గృహనిర్మాణాల్లో కూలీలు క్షతగాత్రులైతే శక్తివేధ!

పి.ఎన్.శాంతాకుమారి *చెన్నై*

** గృహ నిర్మాణమప్పుడు కూలీ క్రిందపడి మా ప్రాణాల మీదకు వచ్చింది.*

స్థలశుద్ధి, శంఖుస్థాపన, స్లాబు, గృహారంభం సమయాల్లో వశిష్ఠ వాస్తు పూజ, బలిదాన విధానా లను నిర్దేశించింది. వాటి లోపం, అవాస్తు దోషం వుంటే గృహం రక్త బలుల్ని కోరి ఇలాంటి సమ స్యల్ని తెస్తుంది.

ఇటిక్యాల ప్రసూన *హైదరాబాద్*

** కాలసర్ప దోషాల్ని వివరించండి?*

కుళిక, శేషనాగ, మహావర్మి, శంఖచూడ, విషోక్తకాల, అనంతకాల, అదృశ్య గోళార్ధ, పాతక దృశ్య వంటివి కాల సర్పదోషాలలో కొన్ని.

జి.శ్రీనివాసులు *విజయవాడ*

** అపార్టుమెంటు, ప్లాటు రెండింటిలో నైరుతి పెరిగాయి.*

అపార్టుమెంటు పెరుగుదల వల్ల కోర్టు వ్యాజ్యాలు, వివాదాలు, స్త్రీ, పురుషరోగాలు; ప్లాటు పెరుగుదల వల్ల ఆర్థిక దుస్థితి, స్త్రీ చెడు తిరు గుళ్లు. పురుషులకు అవమానాలు వుంటాయి.

ఐ.జంబుకేశ్వరరావు *హైదరాబాద్*

** కాలసర్ప దోషం అంటే ఏమిటి?*

సప్తగ్రహాలు రాహుకేతువుల ప్రభావానికి లోనై స్థితి పొందడాన్ని కాలసర్పదోషంగా శాస్త్రాలు ధృవీకరించాయి. వరాహమిహిర సంహితలో వీటికి సంబంధించిన వివరాలున్నాయి.

పి.ఎన్.శరణ్యలక్ష్మి *ఒంగోలు*

** ఆర్థిక, అనారోగ్య, ఉద్యోగ, వివాహ సమ స్యలన్నీ వున్నప్పుడు సంజీవని లాంటి మంచి మాట చెప్పండి.*

దంపతుల జన్మ నక్షత్రాలు, గృహాల దిక్కులు, అక్కడి దోషాలను బట్టి సుదర్శన, లక్ష్మీగణపతి, లక్ష్మీకృత వాస్తు యంత్రాలు చాలా మేలు చేస్తాయి.

ఎన్.ఉమామహేశ్వరి *మార్కాపురం*

** యంత్ర ప్రతిష్ట తర్వాత వారికి మళ్లీ ఉద్యోగం వచ్చింది. పిల్లవాడు మంచి ర్యాంకులో పాసయ్యాడు.*

'లక్ష్మీకృత వాస్తు యంత్రం' మంత్ర బీజాక్షర శక్తిని "అమోఘం, విజయ కేతనం, శుభ పరి ణామే" అంటారు అగస్త్య మహర్షి.

పి.వి.ఆర్.ఆంజనేయశర్మ *నెల్లూరు*

** రోడ్ల మలుపుల వల్ల దిశలు మారు తాయా?*

ఉత్తరాయణ, దక్షిణాయణ కాలాల్లో మలు పులున్న ప్రాంతంలో ఉత్తరం తూర్పుగానూ, దక్షి ణం పశ్చిమంగానూ భ్రమ కలుగుతుంది. తూర్పు సముద్ర తీరస్థ ప్రాంతం తూర్పు. దీనికభిముఖంగా వున్నది పశ్చిమం.

వాస్తు సందేహాలు సమాధానాలు

ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి
4వ వీధి, గాయత్రినగర్, ఎ.కె. నగర్ పోస్టు, నెల్లూరు-4.
ఫోన్: 2322345, సెల్: 9490125878.

వీరుట్ల జమిమా *కలువాయి*

** తూర్పు గృహానికి నైరుతిలోనూ, ఆగ్నే యంలోనూ మెట్లున్నాయి.*

నైరుతి మెట్లు తీసివేయండి. వాయువ్యం సెప్టిక్‌ట్యాంకును నిర్మూలించండి. మీ వారి అనా రోగ్యానికి ఇవి రెండూ కారణమే.

పి.వి.దేవీలక్ష్మి *నెల్లూరు*

** పిల్లల అభివృద్ధి, ఆరోగ్యం, చదువు వీటికేదైనా మంత్ర మున్నదా?*

హనుమాన్ తామ్రకాసులు, గోపుర(శిఖర) అచ్చు పసుపు వస్త్రంలో వుంచి దేవుడి పటాల వెనుక ఉంచడం వల్ల కొంత మేలు జరుగుతుంది.

జడ్.ప్రభుదాస్ *నెల్లూరు*

** ఈశాన్య స్థలంలో పుట్ట వుంది.*

ప్రాథమిక దశలో పుట్టలోపల 'మట్టి దిండ్లు' తయారవుతుంటాయి. వాటితో సహా పుట్టను తీసి వేసి అయిదుగురికి అన్నదానం చేయండి. దానికిది పరిహారం.

పి.ఆర్.డేవిడ్ *ఆత్మకూరు*

** ఆ స్థలంలో నిర్మాణం కొనసాగించడం చాలా కష్టంగా వుంది. ఎందువల్ల?*

ఎదురు కోణవేధ, వీధి దృష్టి, స్థలవాస్తు దోషాలు, జాతకరీత్యా మీకు నడుస్తున్న రాహు స్థితి(శత్రు) ఇవన్నీ కారణాలు. పూజా మందిరంలో "నారికేళ" బంధనం ఈశాన్యంలో వుంచి స్థల వాస్తును సరిచేసుకోండి.

విద్యాశాఖ పరువు మరోసారి బజారున పడింది!

విద్యాశాఖలో నకిలీ వైద్య బిల్లుల వ్యవహారం కలకలం రేపుతోంది. తీగలాగితే డొంక కదిలినట్లు హైదరాబాద్‌లో జనరల్ ఆడిట్ విభాగం రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ రీయంబర్స్‌మెంట్ బిల్లుల చెల్లింపు వ్యవహారంపై నిశిత తనిఖీలు చేపట్టడంతో పలు జిల్లాలలో నకిలీల గుట్టు రట్టయ్యింది. అందులో భాగంగానే నెల్లూరు జిల్లాలోను వైద్యబిల్లుల్లో అవకతవకలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. దీంతో రాజధాని నుంచి దీనిపై విచారణ జరపమని విద్యాశాఖకు ఆదేశాలు

"మెడికల్ రీయంబర్స్‌మెంట్ క్రింద లక్షా ఇరవై ఒక్కవేల ఆరు వందల రూపాయల నకిలీ వైద్య బిల్లు పెట్టిన ఉపాధ్యాయుడ్ని గుర్తించడంలో జిల్లా విద్యాశాఖాధికారులు ఘోరంగా విఫలమయ్యారు."

అందాయి. అక్షరాలా లక్షా ఇరవైఒక్కవేల ఆరువందల రూపాయలు నకిలీ వైద్య బిల్లులు పెట్టి దిగమింగేందుకు ప్రయత్నించినట్లు తెలిసినప్పటికీ ఆ ఉపాధ్యాయుడిని గుర్తించడంలో విద్యాశాఖ విఫలం అయ్యింది.

సాధారణంగా వైద్య బిల్లులకు సంబంధించి 25వేల రూపాయల వరకు జిల్లా స్థాయిలో ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ ద్వారా మెడికల్ బోర్డుకు వెళతాయి. అక్కడ పరిశీలన జరిగిన అనంతరం బిల్లును నామమాత్రంగా తగ్గించి మిగతా మొత్తం చెల్లించమని ప్రభుత్వానికి సిఫార్సు చేస్తారు. 25 వేల రూపాయల పైబడిన బిల్లులకు విద్యాశాఖ సంచాలకుల నుంచి విడుదలకు సంబంధించి ఆదేశాలు అందాల్సి వుంటుంది. కొందరు ఉపాధ్యాయులు, సిబ్బందికి మెడికల్ రీయంబర్స్‌మెంట్ బిల్లులు ఆదాయ వనరుగా మారడంతో కాగితాలపైనే జబ్బులకు చికిత్స పొందినట్లు చూపి లక్షలాది రూపాయలు స్వాహా చేసేస్తున్నారు. విద్యాశాఖలో సంచలనం రేపిన వ్యవహారం ఇలాంటిదే. సిహెచ్.వెంకటయ్య అనే ఉపాధ్యాయుడు తన భార్య సుశీలమ్మ పేరుతో గుండె శస్త్రచికిత్స జరిగిందంటూ 1,21,600 రూపాయలకు బిల్లు పెట్టాడు. దీనికి సంబంధించి మొత్తం విడుదల కాగా ఆ ఉపాధ్యాయుడు ఎవరు? ఎక్కడ పని చేస్తున్నాడనేది అంతు చిక్కడం లేదు. గతంలో రూరల్ మండలంలో అనంతసాగరంలో పనిచేసిన వ్యక్తి, నకిలీ బిల్లులు పెట్టిన టీచర్ ఒక్కరేనా? లేక ఇంకొకరు వున్నారా? వుంటే ఎక్కడ పని చేస్తున్నారు? అసలు పని చేస్తున్నారా లేక రిటైరయ్యారా అనేది తెలియడం లేదు. విద్యాశాఖ ఈ వ్యక్తి ఆచూకీ కనుగొనడంలో ఘోరంగా విఫలమయ్యింది.



నిరంతరం వార్తల్లో జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం.

టీచర్ ఆచూకీ కనుగొనేందుకు, ఈ వ్యవహారంపై విచారణ జరిపేందుకు గూడూరు డిప్యూటీ డిఇఓ ప్రసన్న ఆంజనేయులు నేతృత్వంలో ముగ్గురు సభ్యులతో కమిటీని నియమించినప్పటికీ ఇంతవరకు ఈ గోల్మాల్‌పై నిజాలు నిగ్గుతేల్చలేకపోయింది. మరో వైపు డిఇఓ బాలకాశయ్య ప్రస్తుతం బిల్లుల కోసం పెట్టుకొన్న దరఖాస్తులను నిలిపివేయడంతో నిజంగా వైద్య బిల్లులు అవసరమైన వారు తిప్పలు పడాల్సి వస్తోంది. అంతేకాకుండా వైద్యబిల్లులను ఫార్వర్డ్ చేసే సిబ్బంది వద్ద నుంచి డిక్లరేషన్ పొందాలన్న అధికారుల ఆలోచన వివాదస్పదమవుతోంది. బిల్లులు పెట్టే ఉపాధ్యాయుల నుంచి డిక్లరేషన్ పొందాల్సి వుండగా పనిచేసే తమ వద్ద నుంచి దానిని పొందాలనుకోవడంపై సిబ్బంది మండిపడుతున్నారు. మొత్తం మీద నకిలీ వైద్య బిల్లులు వ్యవహారం విద్యాశాఖలో కలకలం రేపింది.

ఆధార్ కార్డులైనా సక్రమంగా ఇస్తారా?

త్వరలో రేషన్‌కార్డుల స్థానంలో "ఆధార్ కార్డులు" రానున్నాయి. దేశవ్యాప్తంగా గుర్తింపు కార్డుగా కూడా వీటిని పరిగణిస్తారు. రేషన్ కార్డులను తొలగించి వాటి బదులు వీటిని అందజేస్తారు. రేషన్ షాపుల నుంచి సరుకులు తీసుకొనే దగ్గర నుంచి ప్రభుత్వం అమలు చేసే అన్ని పథకాలకు ఆధార్ కార్డులనే పరిగణలోకి తీసుకొంటారు. దేశవ్యాప్తంగా ఒకే విధానాన్ని అమలు చేయాలన్న లక్ష్యంతో కేంద్రప్రభుత్వం ఆధార్ కార్డుల జారీకి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మన రాష్ట్రంలో రంగారెడ్డి, పశ్చిమగోదావరి, మెదక్ జిల్లాలలో తొలుత వీటిని జారీ చేస్తారు.


"రేషన్‌కార్డుల స్థానే బహుళ ప్రయోజన కార్డుగా ఇస్తామంటున్న ఆధార్ కార్డులను జిల్లాలో ఇవ్వను రంగం సిద్ధమవుతుంది. గతంలో జరిగిన అవకతవకలు అరికట్టకుండా ఈ కార్డులిస్తే ఇచ్చిన ప్రయోజనం కూడా నెరవేరదనాలి."

రాష్ట్ర పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో ఈ కార్డులను ప్రజలకు అందజేస్తారు. విశిష్ట గుర్తింపు కలిగిన ఈ కార్డులను జారీ చేసిన అనంతరం ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఏదైన లబ్ధిపొందాలంటే ఈ కార్డులు తప్పనిసరిగా సమర్పించాల్సి వుంటుంది. ఇప్పటివరకు విచ్చల విడిగా జారీ చేసిన రేషన్‌కార్డుల మాదిరిగా జారీ చేసేందుకు అవకాశం వుండదు. ఈ కార్డులను పొందేందుకు రాష్ట్రంలో ఏ బిపిఎల్ కేంద్రంలోనైనా దరఖాస్తు సమర్పించవచ్చు.

ఈ కార్డులు అమల్లోకి వస్తే బోగస్ రేషన్‌కార్డులకు పూర్తిగా చెక్ పడుతుంది. పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న చౌకదుకాణాలలో కూడా అక్రమాలను నిరోధించవచ్చన్నది ప్రభుత్వ లక్ష్యం. అలాగే ఒక ప్రాంతంలో నివాసం వున్నవారు మరో ప్రాంతానికి వలసలు వెళ్లినప్పుడు ఆ ప్రాంతంలో వున్న రేషన్‌షాపు నుంచి ఆధార్‌కార్డు ద్వారా సరుకులు తీసుకొనే విధానం వుంటుంది. రాష్ట్ర రాజధానిలో పౌరసరఫరాలశాఖ కమిషనర్ కార్యాలయంలో అనుసంధానం ఏర్పాట్లు కూడా చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వున్న రేషన్‌షాపుల్లో రోజుకు ఎన్ని సరుకులు లబ్దిదారులకు అందజేస్తున్నారన్న సమాచారం క్షణాల్లో తెలుసుకొనే అవకాశం వుంటుంది.

రెండవ విడతలో మరికొన్ని జిల్లాల్లో ఈ విధానాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. రెండవ విడతలో నెల్లూరు జిల్లాలో కూడా ఈ విధానం అమలు చేసేందుకు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు ముందస్తు ఏర్పాట్లలో వున్నారు. ఇటీవల పౌరసరఫరాలశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ ఆధార్ కార్డుల వినియోగంపై ప్రయోజనం గురించి ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్డు జారీ చేసే సమయంలోనే లబ్దిదారుడు సమర్పించిన దరఖాస్తుపై పూర్తిగా విచారణ జరిపి కార్డును పంపిణీ చేస్తారు.

ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా వుండే ఈ కార్డు జారీ చేసే విధానంపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇంకా జారీ కాలేదు. ఇప్పటివరకు రేషన్‌కార్డులు రెండు రకాలుగా జారీ చేసి వున్నారు. వీటిలో గులాబి, తెల్ల కార్డులు వున్నాయి. ప్రస్తుతం తెల్లరంగు రేషన్‌కార్డుకు చౌక దుకాణాల్లో బియ్యం ఇతర సరుకులు అందజేస్తున్నారు. గులాబి రంగు కలిగిన కార్డులను గుర్తింపు కార్డులుగా వుపయోగిస్తున్నారు. 60వేల ఆదాయం వున్న వారికి జారీ చేసి వున్న గులాబి రంగు కార్డును తెల్లరంగు కార్డుగా మార్పు చేసేందుకు సంవత్సరం క్రితం ఉత్తర్వులు జారీ



ఆధార్ కార్డులను ఇచ్చే బాధ్యతలు చేపట్టనున్న జిల్లా పౌరసరఫరాల శాఖ.

చేసింది. దీంతో రెవెన్యూ యంత్రాంగం ఐరిస్ కెమెరాలతో ఫోటోలు కూడా తీసింది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశ పెట్టి కఠిన నిబంధనలు విధిస్తున్నా పాలకులు, అధికారులు ఏదో ఒక రూపంలో వీటికి తూట్లు పొడుస్తున్న సంఘటనలు అందరికి తెలిసిందే. ఆధార్ కార్డుల జారీలోనైనా కఠినంగా వ్యవహరిస్తారో లేదో వేచి చూడాలి.



కత్రినా అక్షయ్‌ల మధ్య గొడవ!

బాలీవుడ్‌లో ప్రస్తుతం నెంబర్ వన్ హీరోయిన్ కత్రినాకు ఆమె హితైషి హీరో అక్షయ్‌కుమార్ మధ్య చిన్నపాటి మనస్పర్థలు వచ్చాయట. ఓ ప్రోమో కోసం అక్షయ్ ఆమె డేట్లు అడిగితే కుదరదని చెప్పిందట. బాలీవుడ్‌లో కత్రినా అగ్రతారగా ఎదిగేందుకు తనవంతుగా ఎంతో సహకరించిన తనకు ఆమె కుదరదని చెప్పడంతో కోపమొచ్చిన అక్షయ్ గొడవ పడ్డాడట. వీరిద్దరికీ మాటా మాటా పెరిగి కొట్టుకోగా ఈ సందర్భంగా ఆ సెట్‌లోనే వుండిన దర్శకురాలు ఫరాఖాన్ విడదీసినట్లు సమాచారం.

చైన్ స్మోకర్‌గా ఆర్తి!

హీరోయిన్‌గా ఆర్తి అగర్వాల్ మంచి గుర్తింపు తెచ్చుకొంది. అయితే ఆమె క్రమశిక్షణ లోపంతో ఒక్కసారిగా పతనావస్థకు చేరింది. హీరో తరుణ్‌తో ఆమె ప్రేమాయణం బెడిసి కొట్టడంతో ఓ ఎన్‌ఆర్‌ఐని పెళ్లి చేసుకొంది. ఆ పెళ్లి కూడా పెటాకులు కావడంతో తిరిగి సినిమాల్లో చేరింది. ఇటీవల సినిమాలు అసలు లేకపోవడంతో పబ్బుల్లో విపరీతంగా కనిపిస్తుంది. వ్యసనపరురాలిగా మారింది. ఎక్కడ కనపడ్డా నోట్లో సిగరెట్‌తోనే ఆమె దర్శనమిస్తోంది. ఇదే పద్ధతి కొనసాగిస్తే ఆర్తి ఊపిరి తిత్తులు పాడవడం ఖాయమంటున్నారు.



అసిన్ నడుము నాజూకయ్యింది!



బాలీవుడ్‌లో చిత్రాలు చేజిక్కించుకొనేందుకు హీరోయిన్ అసిన్ దేహ ప్రదర్శనకు సిద్ధమని ప్రకటించింది. వెనువెంటనే వస్త్రధారణ తీరును మార్చుకొంది. కురచ దుస్తులతో తీయించుకొన్న ఫోటోలను పత్రికలకు పంపడంతోపాటు తన సైట్‌లో వుంచింది. అంతేకాక తన నడుమును గూర్చి బాలీవుడ్‌లో కొన్ని విమర్శలు ఎదుర్కొన్న ఆమె మొత్తానికి నాజుకు నడుమును సాధించింది. ప్రస్తుతం తన నడుము ఇలియానాతో పోటీపడే స్థాయిలో వుందని ప్రకటించింది. వీరి కొలతలెవరు కొలవగలరు?

● లారాదత్తా

సహజీవనం



చెక్కు చెదరని వన్నెతో రోజురోజుకు నాజూకుగా కనిపిస్తున్న హీరోయిన్‌గా బాలీవుడ్ భామ లారాదత్తాను పేర్కొనవచ్చు. గత కొన్నేళ్లుగా మహేష్ భూపతితో ప్రేమాయణం సాగిస్తున్న లారా అతడితో సహజీవనం చేస్తుండడంతో వారిద్దరికీ వివాహం కాకుండానే ఆమె నంతా మిసెస్ మహేష్‌గా పిలుస్తున్నారు. వారి కస్సలు వివాహమాడే ఉద్దేశ్యముందా అన్న సందేహం కూడా ఆమె అభిమానుల్లో మొదలైంది. బాలీవుడ్‌లో ఇలా వివాహం కాకుండా భార్యా భర్తలుగా చలామణి అవుతున్నవారు చాలా మందే వున్నారు. ముఖ్యంగా జాన్‌అబ్రహాం, బిపాసబసు లైతే చాలా రోజులుగా ఈ విధానాన్నే అనుసరిస్తున్నారు.

బృందావనం బాగుంది!



✍ అల్లూరు రహీం

నవరసభరిత చిత్రాలను ప్రేక్షకులు ఎగబడి చూస్తారు. ఈ కోవలోనిదే ఎన్టీఆర్‌ను హీరోగా పెట్టి వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు నిర్మించిన చిత్రం బృందావనం. ఈ చిత్ర కథ పాతదే. కాని నూతన దర్శకుడు పైడిపల్లి వంశీ వెండితెరపై నడిపించిన తీరు బాగుంది. ఈ సినిమా కథను ఎన్టీఆర్‌ను దృష్టిలో పెట్టుకొనే దర్శకుడు వ్రాసినట్లున్నాడు. అందుకు తగ్గట్టు భారీ తారాగణం, సెట్టింగులు, పాటలు, సంగీతం, కెమెరా పనితనం, పోరాటాలు వీటికి తోడు ఇద్దరు హీరోయిన్లు కాజల్, సమంత ఈ చిత్రానికి బాగా ఉపయోగపడ్డారు. గ్లామర్ బాయ్‌గా కనపడుతూనే హీమ్యాన్‌గా ఈ చిత్రంలో దరిదాపులు అన్ని ఫైట్స్ సీన్లలో ఎన్టీఆర్ అదరగొట్టేస్తాడు. ఫైట్ మాస్టర్ల జంట రామ్ – లక్ష్మణ్ వినూత్న తరహా ఫైట్స్ కంపోజ్ చేశారు. ఆర్టీసి బస్సును హీరో స్కూటర్‌లా తిప్పే ఫైట్ కాస్త అతిగా తోస్తుంది. థమన్ సంగీతంలో వాయిద్యాల మాటున కొన్నిసార్లు పదాలు వినపడకపోయినా అతని సంగీతం కొత్త బాణీలతో సాగింది. ఎవరెవరో పాట గందరగోళంగా వున్నా హీరోయిన్ సమంతను చూస్తూ చూసేస్తారు. సూరీడు... సూరీడు పాట అంతే. కాజల్ యువ ప్రేక్షకులను మంత్రముగ్దులను చేస్తుంది. నిజమేనా పాటలో కెమెరామెన్ చోటా కె నాయుడు తన టెక్నిక్ చూపిస్తాడు. వచ్చాడురా పాటలో తెర నిండా తారాగణంతో నిండుగా వుంటుంది. రెచ్చిపో పాటలో ఇద్దరు హీరోయిన్లు కలిసి రికార్డు డ్యాన్స్‌లా చేసేశారు. కథను విస్తృతపరచడంలో సహకారమందించడంతోపాటు మాటలు కూడా వ్రాసిన కొరటాల శివ మాటలు పొడిగా వున్నా సూటిగా ప్రేక్షకుల మనసును తాకుతాయి. అక్కడక్కడా బూతులు మాట్లాడించబోయి మళ్లీ వెనక్కు తగ్గాడాయన. స్టేట్‌లో పెళ్లీడుకొచ్చిన కత్తిలాంటి కుర్రాడిని నేనే డైలాగ్ కాస్త అతిగా తోస్తుంది. జూనియర్ వేణుమాధవ్, బ్రహ్మానందం, హేమతో పాటు ఎన్టీఆర్ కూడా పలు సన్నివేశాల్లో కడుపుబ్బా నవ్విస్తాడు. గ్లామర్ డ్రస్సులతో సమంత కాజల్‌ను డామినేట్ చేస్తుంది.

చిత్రకథలోనికి వెళ్తే ఆగర్భ శ్రీమంతుడు, పారిశ్రామికవేత్త (ముఖేష్ రుషి) ఏకైక కుమారుడు క్రిష్ (ఎన్టీఆర్). కుమారుడంటే ముఖేష్ రుషికి ప్రాణం. అతను ఏ పని చేసినా గుడ్డిగా సమర్థిస్తాడు. ఇంజనీరింగ్ చదివే క్రిష్ తన క్లాస్‌మేట్ ఇందు (సమంత)ను ప్రేమిస్తాడు. ఆమె తన ఫ్రెండ్ భూమి (కాజల్) ప్రియునిగా కొన్నాళ్లు నటించమని రాయలసీమలోని లక్ష్మీపురం గ్రామానికి పంపుతుంది. గ్రామంలో ఫ్యాక్షనిస్ట్ భానుప్రసాద్ (ప్రకాష్ రాజ్) ఏకైక కుమార్తె భూమి. అతని చెల్లెళ్లు మహాలక్ష్మి (సన), శ్రావణి (సురేఖావాణి)లు. వారి భర్తలు ప్రసాద్ (ఆహుతి ప్రసాద్), గిరి (రఘుబాబు)లు. భానుప్రసాద్ తండ్రి (కోట శ్రీనివాసరావు)కు ఇద్దరు భార్యలు. రెండో భార్య కుమారుడు శివుడు (శ్రీహరి) ప్రక్క ఊరు లక్ష్మీపురంలో వుంటాడు. తన కుమార్తెను తనికెళ్ల భరణి కుమారుడు అజయ్‌కిచ్చి పెళ్లి చేస్తానంటాడు భానుప్రసాద్. కాని భూమి క్రిష్‌ను తన ప్రియుడని ఇంటికి తీసుకరావడంతో అగ్గి మీద గుగ్గిలమవుతాడు. క్రిష్ అస్తవ్యస్తంగా వున్న భానుప్రసాద్ ఇంటిని బృందావనం చేస్తాడు. ఇంట్లో వాళ్ల మధ్య ఆప్యాయత అనురాగాలు పూయిస్తాడు. విడిపోయిన భానుప్రసాద్, శివుడులను కలుపుతాడు. దీంతో భానుప్రసాద్ మనసు మారుతుంది. భూమికి క్రిష్‌కు నిశ్చితార్థం చేయ సిద్ధపడతాడు. ఈ సమయంలోనే ఇందు వస్తుంది. ఆమె ఎవరో కాదు. శివుడు పెంపుడు కుమార్తె. వీరిద్దరి మధ్య బంధురికం ముందు తెలియదు. అక్కాచెల్లెళ్లు భూమి, ఇందుల మధ్య క్రిష్ నలుగుతాడు. అంతిమంగా వీరి గూర్చి తల్లితండ్రులకు తెలుస్తుంది. తమ కుటుంబాన్ని బాగుచేసిన క్రిష్‌కే ఇద్దరు కుమార్తెలనిచ్చి పెళ్లి చేయను పెద్దలు నిశ్చయించడంతో చిత్రం ముగుస్తుంది.

ఎన్టీఆర్ యంగ్ యనర్జటిక్ నటన ఈ చిత్రానికి పెద్ద ప్లస్ పాయింట్. బృందావన మందరిదిలా ఈ చిత్రం అన్ని తరహా ప్రేక్షకులను అలరిస్తుంది.

● శాంతిలాల్ జ్యువెలరీలో

దేవతా వస్త్రాలు!

నెల్లూరులో నమ్మకమైన నగల వ్యాపారిగా పేరు గడించిన శాంతిలాల్ ఇప్పటికే వ్యాపార రంగంలో కొత్త పోకడలు సృష్టించి ఎంతో పేరుప్రఖ్యాతులు పొందారు. గత కీర్తితో సరిపెట్టుకోకుండా ఆచారి వీధిలోని శాంతిలాల్ జ్యువెలరీలో దేవతా మూర్తులకు అలంకరించే దివ్య వస్త్రాలను



ప్రత్యేక వస్త్రాలంకరణలో రాధాకృష్ణులు, పార్శ్వనాధుడు.

కూడ అందుబాటులోనికి తెచ్చారు. బంగారు, వెండి దారాలతో తయారుచేసిన ఈ వస్త్రాలను ఆలయాలు, ఇళ్లలోని దేవతా మూర్తుల విగ్రహాలకు అలంకరిస్తే మరింత దివ్య మంగళంగా విగ్రహాలు ప్రకాశిస్తాయి. పూజచేసే సమయంలో ఏకాగ్రతను తెచ్చిపెట్టేలా వున్నాయి ఈ వస్త్రాలు. ఈ విభాగం ప్రారంభం సందర్భంగా వినాయకుడు, లక్ష్మీదేవి, వెంకటేశ్వరస్వామి, సాయిబాబా, రాధాకృష్ణులు, పార్శ్వనాధునికి చేసిన అద్భుత వస్త్ర అలంకరణ అబ్బుర పరిచింది. శాంతిలాల్ జ్యువెలరీలో దేవతా విగ్రహాలకు వస్త్రాలతోపాటు దైవపూజకు వినియోగించే వివిధ రకాల పుష్పాలు, పూజా సామాగ్రి కూడ అందుబాటులో వుంచినట్లు శాంతిలాల్ జైన్ చెప్పారు.

పేదలకు ఋణాలివ్వండి!

మైక్రోఫైనాన్స్ సంస్థల నుండి లక్షలాది కుటుంబాలు బలికాకుండా బ్యాంకులు పేద మహిళలకు ఇచ్చే రుణాలను వేగవంతం చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి బ్యాంకర్లకు ఉద్బోధించారు. 16వ తేది



గోల్డెన్ జూబ్లీహాల్‌లో జరిగిన బ్యాంకర్ల సదస్సులో మాట్లాడుతున్న మంత్రి రామనారాయణరెడ్డి.

గోల్డెన్ జూబ్లీహాల్‌లో జరిగిన బ్యాంకర్ల సమావేశానికి మంత్రి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. జిల్లాలో ఇందిర క్రాంతి పథం, బ్యాంకర్లు, డిఆర్‌డిఏల సమన్వయంతో పేద మహిళా గ్రూపుల ఆర్థిక పరిస్థితులను మెరుగు పరచడానికి అన్ని చర్యలు తీసుకొంటున్నట్లు తెలిపారు. గత ఎన్నికల్లో కొన్ని పార్టీల వాగ్దానాల వల్ల మహిళా స్వయం సహాయక గ్రూపులు అప్పట్లో ఆరు నెలలు బ్యాంకులకు తిరిగి సొమ్ము చెల్లించనందున రికవరీ శాతం పడిపోయిందన్నారు. దీనివల్ల బ్యాంకర్లలో నిరాసక్తత ఏర్పడిందన్నారు. బ్యాంకులు పేద మహిళలకు వారి అవసరాలకు సరిపడినంత సొమ్మును యివ్వకపోవడం, సరైన సమయానికి బ్యాంకుల నుండి సొమ్ము వారికి అందకపోవడంతో మహిళలు మైక్రోఫైనాన్స్ సంస్థలను ఆశ్రయించడం జరుగుతుందన్నారు. దీనిని అదునుగా తీసుకొని మైక్రోఫైనాన్స్ సంస్థలు అధిక వడ్డీలకు అప్పులు ఇచ్చి వడ్డీ వసూలులో ఇబ్బందులు పెడుతున్నాయన్నారు. జిల్లాలో ఈ సంవత్సరం 300 కోట్ల రూపాయలు స్వయం సహాయక సంఘాలకు ఋణాలు ఇవ్వాల్సి వుండగా ఇప్పటివరకు 85 కోట్ల రూపాయలు మాత్రమే ఇచ్చారని, రాబోయే ఆరు నెలల్లో మిగిలిన సొమ్మును అందించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాంగోపాల్, అదనపు జాయింట్ కలెక్టర్ టి.సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరులో ఘనంగా దసరా!

నెల్లూరు నగరంలోని వివిధ దేవాలయాల్లో దసరా సందర్భంగా శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. మొత్తం పది రోజులపాటు జరిగిన ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో ఆలయాలు కిటకిటలాడాయి. నవరాత్రుల సందర్భంగా దేవేరులను వివిధ రూపాల్లో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. దర్గామిట్టలో గల శ్రీ రాజరాజేశ్వరి ఆలయంలో దసరా ఉత్సవాలు



గజలక్ష్మి అలంకారంలో రాజరాజేశ్వరమ్మ.

అత్యంత వేడుకగా జరిగాయి. సింహపురి గ్రామదేవత ఇరగాళమ్మ ఆలయం, స్టోన్‌హౌస్‌పేటలోని శ్రీ కన్యకాపరమేశ్వరి దేవాలయాల్లో ఈ పది రోజులు చండీయాగం, పూలంగిసేవ వైభవంగా నిర్వహించారు. కన్యక పూజను అత్యంత వేడుకగా చేశారు. మహిషాసుర మర్ధినిగా, దుర్గామాతగా, సరస్వతీ దేవిగా, అన్నపూర్ణదేవిగా వివిధ రూపాల్లో దేవి భక్తులకు దర్శనమిచ్చింది. గుప్తాపార్కు వద్ద గల వైష్ణోదేవి ఆలయంలో 26 లక్షల రూపాయలు వెచ్చించి వెయ్యి రూపాయల నోట్లతో దేవిని అలంకరించడం విశేషం. మొత్తం మీద దసరా వేడుకలు నగరంలోని పలు మందిరాల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి.

ఆహార భద్రత కల్పించాలి

బిజెపి జాతీయనేత వెంకయ్యనాయుడు సూచన.

దేశ ప్రజలందరికీ ఆహార భద్రత కల్పించాలని బిజెపి జాతీయ నాయకుడు ఎం.వెంకయ్యనాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయదశమి పండుగను పురస్కరించుకొని బిజెపి జిల్లా కార్యాలయంలో పూజలు నిర్వహించిన ఆయన పలు అంశాలపై మాట్లాడారు. ప్రజల సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విస్మరించాయన్నారు. కేంద్ర, రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వున్నప్పటికీ ప్రజలకు జరిగిన మేలు శూన్యం అన్నారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విస్మరించిందని, ఫలితంగా రైతులు దిక్కుతోచని స్థితిలో వున్నారన్నారు. పండించిన ధాన్యాన్ని నిల్వ చేసుకొనేందుకు తగినన్ని గోడౌన్లు లేవని, వీటి ఏర్పాటులో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలో వుండగా రైతుల అవసరాలకు అనుగుణంగా గోడౌన్లను అందుబాటులో వుంచామని గుర్తు చేశారు. నేడు 31.8 మిలియన్ టన్నుల ధాన్యం నిల్వ చేసేందుకు గోడౌన్లు లేకపోవడం సిగ్గుచేటన్నారు. వ్యవసాయ రంగంలో స్వామినాధన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు.



బిజెపి జిల్లా అధ్యక్షుడు ఆంజనేయరెడ్డి, సురేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ నౌకర్ల జీతాల చెల్లింపులో ఆలస్యం!

రెవిన్యూ శాఖలో గ్రామ నౌకర్లుగా కీలక బాధ్యతలు నిర్వహిస్తుంటారు. పగలు రాత్రి తేడా లేకుండా డ్యూటీ చేస్తుంటారు. ఆ శాఖలో ఏ స్థాయి అధికారి పిలిచినా అటెండెన్స్‌లో వుంటారు. వీరికి నెలకు జీతంగా 2400 రూపాయలు ఇస్తారు. కానీ ఈ జీతం రెవిన్యూ శాఖ నెల నెల సక్రమంగా చెల్లించడం లేదు. 10వ తేది పైన జీతం ఇస్తుండడంతో వచ్చే స్వల్ప మొత్తం జీతంతో కుటుంబాలను పోషించడం కష్టంగా వుంటుందన్నారు. తమ జీతం విషయంలో జిల్లా కలెక్టర్ చొరవచూపి ప్రతినెల 5వ తేది అందేలా చేయాలని గ్రామ నౌకర్లు కోరుతున్నారు.

నోటరీల చుట్టూ విద్యార్థుల గిరికీలు

కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్నట్లు విద్యార్థులకు సులువుగా అందాల్సిన ఆదాయ ధృవీకరణ పత్రాలు కొత్తగా వచ్చిన 1307 జిఓతో గగనంగా మారాయి. గతంలో ఈ సర్టిఫికేట్లను తహశీల్దార్ రేషన్ కార్డులననుసరించి విఆర్ఓ రిపోర్టుతో అందించేవారు. ఇప్పుడేమో ప్రతి దరఖాస్తుదారు విధిగా స్టాంపు పేపరుపై నోటరీతో ధృవీకరించాల్సి వస్తుంది. ఈ నెల 7వ తేది నుంచి అమలైన ఈ విధానంతో విద్యార్థులు, వారి తల్లితండ్రులు పనిబాటమాని స్టాంపు వెండర్లు, నోటరీల దగ్గర కాపు కాస్తున్నారు. స్కాలర్‌షిప్పులు, ఫీజు రీయంబర్స్‌మెంట్ కొరకు ఆదాయ ధృవీకరణలు అవసరమైనవారు 300 రూపాయలు ఖర్చు పెట్టుకోవాల్సి వస్తుంది. స్టాంపు ధర పది రూపాయలైనా ఇతర ఖర్చులు తడిచిమోపెడవుతుండడంతో నిరుపేదలు తమకు కొత్తదైన కోర్టు ప్రాంగణాల చుట్టూ తిరగలేక పోతున్నారు. ఆర్థిక స్థోమత కలిగిన వారు వీటిని ఉపయోగించుకొంటారన్నది కుంటిసాకు మాత్రమే. విచారణాధికారి సక్రమంగా ఉంటే ఇటువంటివి తలెత్తవు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని మండలానికో నోటరీ ఏర్పాటు చేస్తేనే సమస్య పరిష్కారమవుతుంది.



జిల్లా కోర్టు ప్రాంగణంలో విద్యార్థుల పాట్లు.



నెల్లూరు బాలాజీనగర్‌లోని సాయిదర్బార్‌లో బాబా మహాసమాధి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక అలంకారం.

అందరూ దొంగలే

మొదటి పేజీ కొరవ

తమకు రావాల్సిన న్యాయమైన వాటా రాబట్టాలని ఎపీఐఐసీ బోర్డు చేత నాలుగు ముక్కల తీర్మానం చేయించి, కథను కంచికి పంపివేశారు. ఎమ్మార్ నుంచి 26శాతం వాటా రాబట్టడం అంటే, కోర్టులో సివిల్ దావా వేయడం ద్వారానే సాధ్యం. క్రింది కోర్టు, పై కోర్టుల మధ్య గిరికీలు తిరిగి ఆ దావా తెగేసరికి పాతికేళ్లు పట్టవచ్చు. అంతవరకు వుండే దెవరు, పోయేదెవరు? సిబిఐ వంటి నేర పరిశోధనా సంస్థల చేత దర్యాప్తుకు ఆదేశిస్తే, మొదటి రోజే ఎమ్మార్ ఆస్తులును జప్తు చేయవచ్చు, నేరం రుజువైతే దోషులను అరెస్ట్ చేయడంతోపాటు కేసును త్వరగా తెమల్చవచ్చు. ఎమ్మార్ కంపెనీ యజమానులను అంత కష్టపెట్టడం రోశయ్య గారికి ఇష్టం లేదని అర్థమైపోతున్నది. అందుకు కారణం వైఎస్ సలహాదారుగా గత ఆరేళ్లలో రాష్ట్రంలో జరిగిన ప్రతి అవినీతి కుంభకోణానికి సూత్రధారిగా వ్యవహరించిన కెవిపి.రామచంద్రరావు. వైఎస్ వున్నప్పుడు ఆయన గీచిన గీత దాటడానికి అటు అధికారులు, ఇటు రాజకీయవాదులు భయపడే వారు. ఇప్పుడు ముఖ్యమంత్రి రోశయ్య కెవిపి అడుగులకు మడుగులొత్తుతున్నాడు. ఎమ్మార్ తీగ లాగితే చాలా డొంకలే కదులుతాయని భయం. ఆ తీగకు చిక్కే వారిలో కెవిపి దగ్గర బంధువులు కూడా వున్నారని ఒక వదంతి. అందువల్లనే రోశయ్య మెడలు వంచి, సిబిఐ విచారణ లేకుండా సర్దుబాటు చేశారని చెప్తున్నారు.

నెలరోజుల క్రితం జరిగిన ఎరువుల దగాపై కూడా ఇదే తీరులో మాయ చేశాడు ముఖ్యమంత్రి. వైఎస్ బావమరిది, కడప మేయర్ రవీంద్రనాథ్‌రెడ్డి ఈ దగాకు సూత్రధారి అని అనుమానం లేకుండా బయటపడి పోయింది. ఆయన నడిపే ఎరువుల మిక్సింగ్ ప్లాంట్‌లు రైతుల నోరు కొడుతున్నాయని స్పష్టంగా అర్థమైంది. దానిపై విచారణ జరిపితే, కేసులు పెడితే రవీంద్రనాథ్‌రెడ్డిని అరెస్ట్ చేయాలి. ఆయన నడిపే మిక్సింగ్ ప్లాంట్లను మూసివేయాలి. ఆ దశలోనూ కెవిపి.రామచంద్రరావే రంగంలోకి దిగాడు. ముఖ్యమంత్రిని మెప్పించి కేసు గీసు లేకుండా ఫైల్ మూత వేయించాడు. ఓబుళాపురం ఇనుప ఖనిజం గనుల విషయంలోనూ ముఖ్యమంత్రి రోశయ్య ఇదే మెతక వైఖరి అవలంభిస్తున్నాడు. అవతల కర్ణాటక ప్రభుత్వం తమ పరిధిలోని ఇనుప గనులపై కఠిన నిర్ణయాలు తీసుకొంటున్నా, రాహుల్ గాంధీ అంతటివాడు గనుల దోపిడీ ఆపాలని ప్రకటించి, వేదాంత వంటి అంతర్జాతీయ స్థాయి సంస్థకు ఇచ్చిన గనులను కూడా రద్దు చేయించినా రోశయ్య గారు మాత్రం జగన్‌కు వాటా వుందని చెప్పే ఓబుళాపురం గనుల విషయంలో చూసీ చూడ నట్లు వదిలే స్తున్నాడు.

వైఎస్ కాలం నాటి కుంభకోణాలు జగన్ ప్రమేయం వున్న అవినీతి భాగోతాలు, కెవిపి.రామచంద్ర రావుకు ప్రత్యక్ష సంబంధం కల్గిన వ్యాపార లావాదేవీలన్నిటి విషయంలో ముఖ్యమంత్రి రోశయ్య వైఖరి ఇదే మోస్తరుగా వుంది. ముందుగా అవినీతిని సహించనని భీకర ప్రకటనలు చేయడం, దోషుల భరతం పడుతున్నట్లు హడావుడి సృష్టించడం, ఆ తర్వాత చల్లగా సర్దుకోవడం ఒక ఆనవాయితీగా మారిపోయింది. దీని అర్థం, దొంగలు దొంగలు వూళ్లు పంచుకోవడం మాత్రమే. వైఎస్ అల్లుడు బ్రదర్ అనిల్‌కుమార్‌కు కేటాయించిన బయ్యారం గనుల విషయంలో మాత్రమే రోశయ్య కఠినంగా వ్యవహరించాడు. అందుకు కారణం, ఆ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం నేరుగా జోక్యం చేసుకొని లీజును రద్దు చేయడంతో రోశయ్య కూడా సరే అనక తప్పలేదు. లేకుంటే దాన్నీ మరొక ఎమ్మార్ వలె మసిపూసి మారేడు కాయ చేసి వుండేవాడు.

ఎందువల్ల ఈ పరిస్థితి? రెండు కారణాలు కన్పిస్తున్నాయి. మొదటిది – ఎమ్మెల్యేలు, మంత్రులలో ఇప్పటికీ కెవిపి.రామచంద్రరావుకు వున్న పట్టు. వైఎస్ వారసుడు జగన్ అయినా, వారసత్వ అధికారం మాత్రం కెవిపి.రామచంద్రరావు అనుభవిస్తున్నాడు. మంత్రులంతా ఆయన మాటే వింటున్నారు. కెవిపితో పేచీ పెట్టుకొంటే, కర్ణాటకలో వలే తన ప్రభుత్వం కూడా అస్థిరత్వం పాలౌతుందన్నది రోశయ్య భయం కావచ్చు. రెండవ కారణం – కెవిపి మాట తానూ వింటే, తరాల తరబడి తన కుటుంబం సుఖంగా బ్రతకడానికి సరిపడా వాటా లభిస్తుందన్న ఆశ కావచ్చు.

కారణం ఏదైనా అటు ఢిల్లీ పెద్దలు, ఇటు ముఖ్యమంత్రి కలిసి రాష్ట్ర ప్రజలను వెర్రి వెంగళప్పలుగా చూస్తున్నారన్నది నిజం. తాము ఆడే దొంగ నాటకాలు, దాగుడుమూతలాట తెలుసుకోలేని అమాయకులు ప్రజలు అన్న భావన వారిలో వున్నట్లు కన్పిస్తున్నది. ఈ మోసంతో ఎంతకాలం ప్రజలను మభ్య పెట్టగలరో చూడాలి.

జైపాల్‌రెడ్డి

మొదటి పేజీ కొరవ

వారందరితోనూ చెప్తున్నాడు జైపాల్‌రెడ్డి. అయితే ఆ వెంటనే మరొక ప్రశ్న కూడా సంధిస్తున్నాడాయన. తెలంగాణ సమస్యను ఎదుర్కొనే సత్తా రోశయ్యకు లేదు కాబట్టి, అందుకు తగినవాడు ఎవడు అన్నది ఆ ప్రశ్న. సహజంగానే ఆయన ఎదురుగా వున్న వారు అందుకు మీరైతేనే బాగుంటుందని అంటారు కదా? ఆ మాట విని నవ్వు ముఖం పెడుతున్నాడు.


ఢిల్లీ కామన్‌వెల్త్ క్రీడలలో అసమర్థంగా వ్యవహరించిన ఎమ్మార్ కంపెనీ మీద 180 కోట్ల బ్యాంక్ గ్యారంటీ భారం మోపే నిర్ణయం తీసుకోవడంలో జైపాల్‌రెడ్డికి చాలా దృష్టి వుందని చెప్తున్నారు. హైదరాబాద్‌లో అదే ఎమ్మార్ సంస్థ అవినీతిపై ఒక నిర్ణయం తీసుకోలేక సతమతమౌతున్న ముఖ్యమంత్రి రోశయ్యకు అదొక హెచ్చరిక క్రిందే లెక్క. తానైతే జగన్ కుంభకోణాలను ఎట్లా ఎదుర్కొంటానో ప్రదర్శించడానికే ఇంత త్వరగా ఎమ్మార్ మీద చర్యకు ఉపక్రమించాడని చెప్తున్నారు. ఏది ఏమైనా కొత్త ముఖ్యమంత్రి ముస్తాబులో మహా ఉత్సాహంగా కన్పడుతున్నాడు జైపాల్‌రెడ్డి. ఆయన కోరిక తీరుతుందా లేక స్పీకర్ కిరణ్‌కుమార్‌రెడ్డి వంటి వారు ఆ అవకాశం తన్నుక పోతారా అన్నది సోనియా గాంధీ ఒక్కటే చెప్పగల్గిన సమాధానం.

జనవాణి

2వ పేజీ కొరవ

పేరు శంకరన్ గారిదే. గోదావరి జిల్లాలో ప్రముఖ ఇంజనీర్ సర్‌ఆర్థర్ కాటన్, హైదరాబాద్‌లో ఐపిఎస్ అధికారి ఉమేష్‌చంద్ర విగ్రహాలున్నాయి. ప్రజా సేవకునిగా ఎనలేని సేవలందించిన శంకరన్ గారి జ్ఞాపకార్థం నెల్లూరు కలక్టరేట్ వద్ద ఆయన విగ్రహ ఏర్పాటుకు అనుమతివ్వమని జిల్లా యంత్రాంగాన్ని అభ్యర్థిస్తున్నాను.

డాక్టర్ జగదీష్ నెల్లూరు



నెల్లూరు ముచ్చట్లు

3వ పేజీ కొరవ

మద్యం దుకాణంలోకి వెళ్లి వీరంగం చేసింది. అక్కడ మద్యం సేవిస్తున్న వారు భయంతో పరుగులు తీయగా ఆ మద్యాన్ని త్రాగడంతో మరింత పెట్రేగింది. మైకంలో పలువురిని గాయపరి చింది.

పద్య కళాపరిషత్ సాహిత్యోపన్యాసాలు!

నెల్లూరులోని పద్య కళాపరిషత్ అక్టోబర్ 26వ తేది నుండి 30వ తేది వరకు ప్రతిరోజు సాయంత్రం సాహిత్యోపన్యాసాలు ఏర్పాటు చేసింది. 26వ తేది ఆదిపర్వము – ప్రదమాశ్వాసముపై ఆచార్య సముద్రాల లక్ష్మణయ్య మాట్లాడుతారు. 27వతేది ద్వితీయ శ్వాసముపై బత్తిన సాయి కుమార్‌రెడ్డి, 28వ తేది తృతీయ శ్వాసముపై ఆచార్య చీమకుర్తి వెంకటేశ్వరరావు, 29వతేది చతుర్థ శ్వాసముపై కడిమర్ల వరప్రసాద్ మాట్లాడు తారు. 30వ తేది సుభాషిత రసామృతం గ్రంథాన్ని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య సి.ఆర్.విశ్వేశ్వరరావు ఆవిష్కరిస్తారు. ఎమ్మెల్సీ వితరణ బాలసుబ్రహ్మణ్యం గ్రంథాన్ని సమీక్షిస్తారు. సభా పోషకులుగా స్వయంపాకుల శ్రీనివాసులు వ్యవహరిస్తారు. ఈ కార్యక్రమాలకు సాహితీ అభిమానులను తరలి రమ్మంటున్నారు పద్యకళా పరిషత్ అధ్యక్షులు రామచంద్ర ప్రసాద్.

జగన్ యాత్ర

16వ పేజీ కొరవ

పలుకుతారట. నిజానికి మొదట అనుకొన్న కార్యక్రమం ప్రకారం జిల్లాలో ఓదార్పు యాత్ర డిసెంబర్ వరకు, దాదాపు రెండు నెలలు నడవాలి. కానీ యాత్రకు సరైన జనస్పందన లేకపోవడం, నవంబర్ 7తేది నుంచి లోక్‌సభ సమావేశాలు ప్రారంభం కానుండడంతో యాత్రలో కోత పెట్టాడు జగన్. అంతా కలిసి 23 రోజులకు పరిమితం చేశారు. జగన్ తమ వూరికి వస్తాడనే భావనతో వీధి వీధినా వైఎస్ విగ్రహాలు పెట్టడానికి ఉత్సాహపడినవారికి ఈ కుదింపు నిరాశ కల్గిస్తున్నది. అందువల్లనే నెల్లూరు నగరంలో టిటిడి కళ్యాణ మండపం దగ్గర తెచ్చి పెట్టిన వైఎస్ విగ్రహాలు తీసుక వెళ్లేవారు లేక వానకు నానుతూ, ఎండకు ఎండుతూ దిగులుగా పడి వున్నాయి. మేకపాటి సోదరుల ఉద్దేశం ఏమిటో తెలియదు కానీ, రోడ్డు పక్కన అట్లా అనాధల వలె వైఎస్ విగ్రహాలను వదిలి వేయడం వల్ల, జనం చులకనగా మాట్లాడుకొనే అవకాశం కల్పించినట్లయ్యింది. ఇప్పటికైనా వాటిని జనం కళ్లపడని ప్రాంతానికి తరలించడం మంచిదేమో ఆలోచన చేయండి.

జగన్ యాత్రకు కాంగ్రెస్ పరంగా పెద్ద ప్రతిబంధకాలు లేవు. జనార్దనరెడ్డి ఇటువంటి చీకాకులలో ఎప్పుడూ తల దూర్చడు. ఆదాల ప్రభాకర్ రెడ్డి, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పనబాక కృష్ణయ్య వంటి వారితోపాటు, నేదురుమల్లి జనార్దనరెడ్డి అనుచరులు కూడా తమ తమ పరిధులలో యాత్రలో తాము పాల్గొనడం లేదని ప్రకటించడం తప్ప, యాత్రను అడ్డుకొనే ప్రయత్నాలు చేయడం లేదు. ఆ తల నొప్పి ఒక్క ఆనం సోదరులే భరిస్తున్నారు. నెల్లూరు నగరంలో వైఎస్ విగ్రహాలు లేకుండా చేయాలని వివేకా చేస్తున్న ప్రయత్నాలు నిత్యం ఏదో ఒక ఘర్షణకు కారణమౌతున్నాయి. ఆత్మకూరులో జగన్‌కు మనిషి లేకుండా చేయాలని రామనారాయణరెడ్డి చేసిన ప్రయత్నం విఫలమైంది. అన్ని చోట్ల కంటే ఆత్మకూరు టౌన్‌లోనే జగన్ సభ అబ్బా అన్పించే రీతిలో జరిగింది. జగన్ మీద మోజు, వైఎస్ మీద భక్తి కంటే అధికంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మీద వున్న కక్షతోనే అంత మంది జనం వచ్చారేమో అన్పించింది.

జగన్ యాత్ర పట్ల ప్రజలలో కూడా పెద్ద చర్చ లేదు. రోజూ జరిగే రాజకీయం గురించి జనం మాత్రం ఎంతని మాట్లాడుకొంటారు చెప్పండి? పైగా ఆయన ఉపన్యాసాలలో చిన్నపాటి విశేషం కూడా లేదు. చెప్పిందే చెప్పి విసిగించి వేస్తున్నాడు. కొత్త మాట లేదు, కొత్తదనం అసలే లేదు. అందువల్ల దానిపై జనానికి ఆసక్తి జనించే అవకాశమే లేదు.

యాత్ర ఏర్పాట్లకు సంబంధించి మేకపాటి సోదరులదే నాయకత్వం. కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, నెలవల సుబ్రహ్మణ్యం, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి తదితర నేతలంతా తమ తమ పరిధులలో పర్యవేక్షణ చేస్తున్నారు. ఒక్క కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాత్రం జిల్లా అంతా కలియతిరుగుతున్నాడు. ఆత్మకూరు, సర్వేపల్లి, నెల్లూరు రూరల్, నెల్లూరు నగర నియోజకవర్గాలన్నిటిలో శ్రీధర్‌రెడ్డిదే కష్టం.

● వాహనదారులపై

మళ్లీ పెట్రోల్ భారం!



జేబుకు చిల్లి పెడుతున్న పెట్రోల్ ధర పెంపకం.

కేంద్రప్రభుత్వం ఈనెల 17వ తేది నుంచి దేశవ్యాప్తంగా పెట్రోల్ ధరలను పెంచింది. ఇప్పటికే పెరిగిన ధరలతో సతమతమవుతున్న వాహనదారులపై కొత్త వడ్డింపుతో మరింత అదనపు భారం పడింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లీటర్ పెట్రోల్‌పై 72పైసలు, హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లీటర్ పెట్రోల్‌పై 70పైసలు పెంచింది.

త్వరలో డీజిల్ ధరలు పెంచేందుకు పెట్రోలియం మంత్రిత్వ శాఖ కసరత్తు చేస్తున్నది. ప్రస్తుతానికి డీజిల్ ధరలు పెంచక పోవడంతో సామాన్య ప్రజానీకం కొంతమేర వూపిరి పీల్చుకున్నారు. డీజిల్ ధరలు పెంచి వుంటే జిల్లా ప్రజలపై మరింత అదనపు భారం పడేది. 2009 సంవత్సరంలో రెండు దఫాలు పెట్రోల్, డీజిల్ ధరలు పెరగ్గా 2010 సంవత్సరం మార్చినెలలో ఒకసారి అక్టోబర్ నెలలో మరోసారి ధరలు పెరిగాయి. కేంద్రప్రభుత్వం ఇష్టానుసారంగా పెట్రోల్ ధరలు పెంచడంతో వాహన వినియోగదారులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కాలంలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయి సామాన్య ప్రజలు కొనుగోలు చేయలేని పరిస్థితి ఏర్పడింది. మరో ప్రక్క ద్విచక్ర వాహనాల ధరలు పెరగడం, మైలేజీ తక్కువరావడం జరుగుతుంది. ఈ క్రమంలో కేంద్రప్రభుత్వం పెట్రోల్ ధరలు పెంచడంతో వాహనాలు కొనుగోలు చేయడం కష్టతరంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. నిన్న మొన్నటివరకు లీటర్ పెట్రోల్ ధర రూ.56.75 పైసలు వుండేది. ప్రస్తుతం లీటర్ పెట్రోల్ రూ. 57.47పైసలకు చేరింది. ఈ క్రమంలో పలువురు వెల్లడించిన అభిప్రాయాలను దిగువనిస్తున్నాం.



ధరలు నియంత్రించాలి

నిత్యావసర వస్తువుల ధరలతోపాటు పెట్రోల్ ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది. అవినీతి, అక్రమాలపై దృష్టి సారించకుండా ధరలను విపరీతంగా పెంచుతుంది. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగి సామాన్య ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా కేంద్రం స్పందించి ధరలను నియంత్రించాలి.

– **గణపతి,** నెల్లూరు.



సైకిల్ మేలు

కేంద్రప్రభుత్వం ఇష్టానుసారంగా పెట్రోల్ ధరలు పెంచడం బాధాకరం. భవిష్యత్‌లో పెట్రోల్ ధరలు మరింత పెరిగే అవకాశం వుంది. ఈ క్రమంలో సైకిల్ కొనుగోలు చేయడం మేలు. ఒక ప్రక్క వివిధ రకాల వస్తువుల ధరలు పెరిగి సామాన్య ప్రజలు ఇబ్బంది పడుతుంటే తాజాగా పెట్రోల్ ధరలు పెంచి అదనపు భారం మోపడం సమంజసం కాదు.

– **ఎస్.మల్లి,** కడనూతల.

అభయహస్తానికి అడ్డంకులు!

స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు ప్రతినెలా పెన్షన్ అందించాలన్న లక్ష్యంతో శ్రీకారం చుట్టిన అభయ హస్తం పథకానికి ఆదిలోనే అడ్డంకులు ఎదురవుతున్నాయి.

అరవై సంవత్సరాలు పూర్తయిన వారికి పెన్షన్ ఇవ్వాలన్న సంకల్పంతో ప్రవేశపెట్టిన అభయహస్తం పథకానికి నిధుల కొరత ఏర్పడింది. గత రెండు నెలల నుంచి ఈ పథకం ద్వారా లబ్దిదారులకు పెన్షన్ అందడం లేదు. పెన్షన్ అందకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లోని లబ్దిదారులు అయోమయానికి గురవుతున్నారు. మండల కేంద్రాలలో వున్న అధికారులను పెన్షన్ గురించి అడిగితే ఎటువంటి సమాధానం రావడం లేదు. ఇందిర క్రాంతిపథం ఆధ్వర్యంలో పనిచేసే సంఘమిత్ర, సంఘబంధం సభ్యుల దృష్టికి తీసుకెళ్లితే అభయహస్తం పెన్షన్ మంజూరు చేయలేదని చెబుతున్నారు.

దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి స్వయం సహాయక సంఘాల్లో వున్న సభ్యులకు ప్రతి నెల పెన్షన్ అందించాలన్న లక్ష్యంతో "అభయహస్తం" పథకానికి శ్రీకారం చుట్టారు. సంఘంలో వున్న ప్రతి మహిళ నెలకు 30 రూపాయల వంతున 60 సంవత్సరాల వయస్సు వచ్చే వరకు చెల్లిస్తే ఇంతే మొత్తాన్ని ప్రభుత్వం చెల్లించి లబ్దిదారుని పేరున బ్యాంకుఖాతాలో జమ చేసే విధంగా ఈ పథకాన్ని రూపొందించారు. ప్రస్తుతానికి అయిదు వందల రూపాయలు పెన్షన్ అందించే విధంగా ఏర్పాట్లు జరిగాయి. సభ్యుల పొదుపు చేసుకున్న మొత్తాన్ని బట్టి పెన్షన్ చెల్లిస్తారు. అయితే గత రెండు నెలల నుంచి ఈ పథకం క్రింద చెల్లించాల్సిన నగదు ప్రభుత్వం నుంచి విడుదల కాకుండా నిలిచిపోయింది.

నిధులు విడుదల కాని విషయం గ్రామీణ ప్రాంతాల్లోని లబ్దిదారులకు తెలియకపోవడంతో పెన్షన్ ఎందుకు రావడంలేదని ఆందోళన చెందాల్సి వచ్చింది. ఇందిర క్రాంతి పథం ఆధ్వర్యంలో ప్రతినెల వృద్ధాప్య, వితంతు, వికలాంగులకు పెన్షన్ అందిస్తున్నారు. అభయహస్తం లబ్దిదారుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూడడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం నుండి ఇందుకు అవసరమైన నిధులు విడుదల కాకపోవడంతో అధికారులు కూడా ఏం చేయలేకపోతున్నారు. వృద్ధాప్యంలో వున్న వారికి ఎంతో ఆసరా ఇస్తున్న ఈ పథకం అమలు చేయడం కష్టమని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తుంది.

సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుకు కేటాయించే నిధుల్లో ప్రభుత్వం ఇటీవల భారీ కోత విధిస్తున్నది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం కారణంగా సంక్షేమశాఖల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. బ్యాంకు లింకేజీ ద్వారా అమలు చేస్తున్న పథకాలకు సైతం సబ్సిడీ నిధుల్ని మంజూరు చేయలేని పరిస్థితి జిల్లాలో ఏర్పడింది.

ఈ యేడాది అభయహస్తం పథకంలో లబ్దిదారుల ఎంపిక కూడా ఆగింది. దీంతో అనేకమంది స్వయం సహాయక సంఘాల సభ్యులు ఈ పథకంలో చేరే అవకాశం లేకుండా పోయింది. ప్రస్తుతం గతంలో ఈ పథకం క్రింద జారీ చేసిన బాండ్లను రెన్యూవల్ చేసే పనిలో ఐకెపి సిబ్బంది నిమగ్నమై వున్నారు. ఇందుకోసం డిఆర్‌డిఏ కార్యాలయంలో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేశారు. ప్రభుత్వం నూతన పథకాల్ని ప్రకటించే సమయంలో చూపించిన శ్రద్ధ అమలు చేసే విధానంలో ఏమాత్రం చూపించడం లేదన్న విమర్శలున్నాయి. ప్రభుత్వ అవలంభిస్తున్న విధానాల కారణంగా ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతుంది.

జిల్లాలో అభయహస్తం పథకం అమలు కోసం అధికారులు తగిన కృషి చేయాల్సిన అవసరం వుంది. లేకుంటే ఈ పథకం ఉద్దేశం పూర్తిగా దెబ్బతినే ప్రమాదం వుంది.



సమస్యను పరిష్కరించలేని నెల్లూరులోని ఇందిరక్రాంతి పథం కార్యాలయం.

Regn.No. : RN 1156 / 57 J/Nellore/008/09-11

జనం రాలేదన్న చిరాకు... ద్రోహం చేశారన్న అక్కసు

జగన్ యాత్రలో ఆకర్షణేదీ లేదు!

నెల్లూరు జిల్లాలో వైఎస్ జగన్ ఓదార్పు యాత్ర మూడు నిట్టూర్పులు, ఆరు శాప నార్థాలుగా నడుస్తున్నది. 13తేది రాత్రి పది గంటల సమయంలో కావలి తాలూకా రుద్రకోట మీదుగా నెల్లూరు జిల్లాలోకి ప్రవేశించాడు జగన్. జగన్ పక్కన చేరిన కాంగ్రెస్ నేతలందరూ పోటీలుపడి వందలాది కార్లలో, తమ బలాన్ని చాటుకొనే రీతిలో సరిహద్దులో మొహరించారు. అయితే అక్కడ నుంచి కావలి టౌన్‌కు వచ్చేసరికి జగన్‌కు జనం ముఖం చాటేశారు. బహిరంగ సభ అభాసుపాలైంది. ఆ చిరాకు చిరాకు ఆ పైన మూడు రోజులపాటు అట్లనే నడిచింది. కావలి తాలూకా గ్రామాలు వేటిలోనూ జగన్ ఆశించినంత జనం కన్పించలేదు. కోరుకొన్న స్పందన లభించలేదు. ఆ అసహనాన్ని దాచుకోలేక, కావలి నాయకుడు కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి మీద చిర్రుబుర్రులాడాడు జగన్. అది టీవీ ఛానళ్ల కెమెరాకు చిక్కింది. వారు రాష్ట్రమంతా గబ్బు రేపారు. జగన్ యాత్రకు జనం రావడం లేదని ప్రచారాన్ని వుధృతం చేశారు. ఆ ప్రచారఘాతం నుంచి కోలుకోవడానికి మూడు రోజులు పట్టింది జగన్‌కు. యాత్ర కావలి పరిధి నుంచి ఉదయగిరి నియోజకవర్గ సరిహద్దులలోకి చేరుకొనేసరికి పొరపాట్లను సర్దుబాటు చేసుకొన్నారు.

అందులోనూ ఉదయగిరి అంటే, జిల్లాలో జగన్ పక్షాన్ని తమ భుజాల మీదకు ఎత్తుకొన్న మేకపాటి రాజమోహన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి సోదరుల స్వంత నియోజకవర్గం. అక్కడ చిన్న తప్పు జరిగినా పరువు పోతుంది కదా? అందువల్ల అన్ని జాగ్రత్తలు తీసుకొన్నారు. పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

ఈ యాత్రపై జిల్లాలో పెద్ద రాజకీయ దుమారమే చెలరేగుతున్నది. జగన్ అనుచర బృందం దాదాపుగా ప్రతి రోజూ ఆనం రామనారాయణరెడ్డి, వివేకానందరెడ్డిలను ఏదో ఒక వంకతో శాపనార్థాలు పెడుతూనే వుంది. సాక్షి టీవీ ఛానల్ దాన్నొక డైలీ సీరియల్ వలె ప్రసారం చేస్తున్నది. వైఎస్ వల్ల అన్ని లాభాలు పొంది, ఆయన కుమారుడికి ముఖం చాటేయడం రాజకీయ ద్రోహమన్నది వీరి విమర్శ. ఆనం వారిని తిట్టడానికి హైదరాబాద్ నుంచి అది పనిగా గోనె ప్రకాశరావును నెల్లూరుకు రప్పించారు. గోనె గోల ఎటువంటిదో అందరికీ తెలుసు. ఆనం వారి పుట్టుపూర్వోత్తరాలను నడివీధిలో నిలబడి కడిగి పారేస్తున్నాడాయన. ఆ విమర్శల జడివానకు తట్టుకోలేక, జగన్ యాత్రకు రాని నేదురుమల్లి జనార్దనరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డిలను వదలిపెట్టి, మా మీద మాత్రమే విరుచుక పడడం ఏమి న్యాయమని ఉక్రోష పడుతున్నాడు వివేకానందరెడ్డి. నెల్లూరు జిల్లాలో వైఎస్ అంటే మేము, మేమంటే వైఎస్ అని గత ఆరేళ్లుగా విర్రవీగింది తాము మాత్రమే అన్న నిజాన్ని మరచిపోయి, తమ మీద పడుతున్న బురదను ఆదాల, నేదురుమల్లిల మీదకు విసిరేయడానికి వివేకా చేసే ప్రయత్నాలు సఫలం కావడం లేదు. జనం వారిని తిట్టిన తిట్టు తిట్టకుండా తిడుతున్నారు. వైఎస్‌కు ద్రోహం చేసిన వారిగా జనం మనసులలో ముద్ర పడి పోతున్నారు ఆనం సోదరులు.



రుద్రకోటలో వైఎస్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న జగన్.

యాత్ర కావలి, ఉదయగిరి దాటుకొని 20తేదికి ఆత్మకూరుకు చేరుకొన్నది. 22తేదికల్లా కోవూరు నియోజకవర్గంలో ప్రవేశిస్తుంది. అక్కడ నుంచి నెల్లూరు రూరల్ మీదుగా సర్వేపల్లి, గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట నియోజకవర్గాలు చుట్టి, నవంబర్ 6తేదికి నెల్లూరు నగరంతో ముగింపు

కొరవ 14వ పేజీలో





Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.